తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice

వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

26-08-2026

బుధవారం హైదరాబాద్

సంపుటి: (volume): 1

సంచిక: (ISSUE): 199

PUBLISHED FROM HYDERABAD

పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక సిరి People's Voice

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575


# సురేఖ, చిన్నారెడ్డి ఔట్?

- ఆ ఇద్దరిపై వేటుకు క్రమశిక్షణ కమిటీ నిర్ణయం
- నివేదికలో కఠిన చర్యలకు సిఫార్సులు
- పీసీసీ చీఫ్ కు నివేదిక అందించిన మల్లు రవి
- కాంగ్రెస్ లో క్రమశిక్షణ ముఖ్యమని స్పష్టీకరణ
- పార్టీ లైన్ దాటితే చర్యలు ఉండాల్సిందేనని వెల్లడి
- కేంద్ర కమిటీ తీసుకునే నిర్ణయాలను బట్టి చర్యలు
- మీడియా సమావేశంలో క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి

**హైదరాబాద్, ఆగస్ట్ 25, సిరి న్యూస్:**

కాంగ్రెస్ లో రెండు వికెట్లు పడబోతున్నాయి. కాంగ్రెస్ క్రమశిక్షణ ఉల్లంఘించిన ఇద్దరు నేతలను ఆయా పదవుల నుంచి తొల గించబోతున్నారు. పిసిసి క్రమశిక్షణా కమిటీ నివేదిక ఆధారంగా చర్యలు ఉండ బోతున్నాయని తెలుస్తోంది. ఈ కక్రమంలో మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిలపై క్రమశిక్షణ కమిటీ రూపొందించిన నివేదిక పీసీసీ అధ్యక్షుడు మహేశ్కుమార్ గౌడ్కు అందింది. ఎమ్మెల్యే క్వార్టర్స్లో క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి, వైస్ ఛైర్మన్ శ్యామ్ మోహన్ ఈ నివేదికను మహేశ్ కుమార్ గౌడ్కు అందజేశారు. కొండా

మిగతా 3వ పేజీలో..



## పవర్ ఎగ్జిబిషన్ విజయానికి కృషి చేసిన ఉద్యోగులకు సీఎండీ సన్మానం

- టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో అభినందన సభ
- అంకితభావంతో పనిచేసిన అధికారులకు జ్ఞాపికల ప్రదానం

2






# జీవో 97 రగడ!

- సాంకేతిక బోర్డు విలీనంపై విద్యార్థుల పోరుబాట
- పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేస్తూ ప్రభుత్వ జీవో
- రద్దు చేయాలని తెలంగాణవ్యాప్తంగా రోడ్డెక్కిన వేలాది మంది విద్యార్థులు
- 'శక్తి' స్కీమ్ లో విలీనంపై మేధావుల ఆందోళన
- లక్షలాది మంది గ్రామీణ విద్యార్థుల ఉపాధిని దెబ్బతీసే చర్యగా ఆరోపణలు
- విద్యార్థుల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు కే కేశవరావు నేతృత్వంలో కమిటీ
- కేఎస్ఆర్ కమిటీ కేవలం కాలయాపన కోసమే..
- జీవో 97ను తక్షణమే రద్దు చేయాలని విద్యార్థుల డిమాండ్
- ఆస్తులను అమ్ముకునేందుకే కొత్త పాలసీ తీసుకొచ్చారని హరీష్ రావు ధ్వజం
- ప్రతిపక్షాల మద్దతుతో ఉద్యమం తారస్థాయికి..

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణలోని పాలిటెక్నిక్ కళాశాలలను విలీనం చేసేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో నంబర్ 97 సాంకేతిక విద్యార్థుల్లో తీవ్ర ఆగ్రహ జ్వాలలు రగిలిస్తోంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు స్వల్ప ఖర్చుతో ఉపాధి అవకాశాలను కల్పించే సాంకేతిక విద్యను దూరం చేస్తున్నారంటూ వేలాది మంది విద్యార్థులు రాష్ట్రవ్యాప్తంగా రోడ్డెక్కి ఆందోళనలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం గడిచిన జులై 7వ తేదీన జారీ చేసిన ఈ జీవో మూలంగా రాష్ట్రంలోని 113 సాంకేతిక విద్యను బోధించే కళాశాలలు రానున్న రోజుల్లో ఉన్నత విద్యాశాఖ నుంచి కార్మిక, ఉపాధి శిక్షణ మరియు కర్మాగారాల శాఖ పరిధిలోకి విలీనం కానున్నాయి. దీనిమూలంగా ఏటా పాలిటెక్నిక్ కోర్సులలో ప్రవేశాలు పొందే దాదాపు లక్ష మంది విద్యార్థులు ఇకపై స్కిల్డ్ యూనివర్సిటీలో భాగంగా శిక్షణ పొందాల్సి వస్తుండటంపై తీవ్ర అభ్యంతరాలు

మిగతా 2వ పేజీలో..




## టిమ్స్‌లోనూ నిమ్స్ టారిఫ్‌ల అమలు

- ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం



2

## కేంద్ర కేబినెట్‌లో భారీ మార్పులు?

- ఏడు రాష్ట్రాల ఎన్నికలే లక్ష్యంగా కసరత్తు
- యువతకు పెద్దపీట వేసే అవకాశం
- 12 మంత్రి పదవులు ఖాళీ.. భర్తీపై దృష్టి
- కొత్త మిత్రపక్షాలకు చోటు దక్కే ఛాన్స్
- 2029 లోక్‌సభ ఎన్నికలకూ ప్రాధాన్యం

4





## సర్కార్‌పై పోరాటం ఆగదు

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు
- ముగిసిన మహా నిరాహార దీక్ష
- వైద్యుల హెచ్చరికలు, ముఖ్య నాయకుల ఒత్తిడితో దీక్ష విరమణ

3

## నగరంలో నకిలీ వైద్యుల దందా

- 11మందిని అరెస్ట్ చేసిన టాస్క్‌ఫోర్స్

**హైదరాబాద్, సిరి న్యూస్:**

హైదరాబాద్ నగరంలో నకిలీ వైద్యుల ముఠాపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు విరుచుకుపడ్డారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్ల పరిధిలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్‌లో ఏకంగా 11 మంది నకిలీ డాక్టర్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల పేరుతో

మిగతా 3వ పేజీలో..



## వన మహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలి

- మిగిలిన లక్ష్యాన్ని వర్షాల సమయంలో పూర్తిచేయాలి
- ఉపాధి హామీ కూలీల" రోజుకు కనీసం 60మందికి పని కల్పించాలి
- మహిళా సంఘాలు కుట్టే యూనిఫామ్‌లలో నాణ్యతకు ప్రాధాన్యత
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క



**హైదరాబాద్, ఆగస్టు 25, సిరి న్యూస్ :**

రాష్ట్రంలో కురుస్తున్న వర్షాలను సద్వినియోగం చేసుకుంటూ వన మహోత్సవం లక్ష్యాలను పూర్తిచేయడంతోపాటు ఉపాధి హామీ పనులు, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల కల్పనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క ఆదేశించారు. సచివాలయం నుంచి జిల్లాస్థాయి

మిగతా 3వ పేజీలో..



## రైతులను చైతన్యపరచాలి

2

- ఎల్ నినో, నీట్-పీజీ ఎంట్రెన్స్, పర్యాటకం అభివృద్ధిపై కలెక్టర్లతో సీఎస్ వీసీ



## ఇందిరమ్మ టవర్స్ కు వడివడిగా అడుగులు

- 15 నియోజకవర్గాల్లో టెండర్ ప్రక్రియ పూర్తి
- 27 నుంచి 30 వరకు లక్కీ డ్రా
- మరో 4 నియోజకవర్గాల్లో దరఖాస్తులకు ఆహ్వానం
- సెప్టెంబర్ 3 వరకు దరఖాస్తుల స్వీకరణ
- రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి

**హైదరాబాద్, ఆగస్టు 25, సిరి న్యూస్ :**

పేదవాడికి కూడా నగరంలో సొంత ఇల్లు ఉండాలని, ఆత్మగౌరవంతో జీవించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ కార్యక్రమాన్ని వేగవంతం చేశామని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి

మిగతా 3వ పేజీలో..

# శరవేగంగా మూసీ భూసేకరణ



**హైదరాబాద్, ఆగస్టు 25, సిరి న్యూస్:**

మూసీ ప్రాజెక్ట్ కోసం భూ సేకరణను వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ల్యాండ్ పూలింగ్ పైన స్పష్టమైన విధానం రూపొందించుకోవాలన్నారు. మూసీ ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఎస్టీఎల్, బఫర్ జోన్, అసైన్డ్ భూముల సేకరణ కోసం స్పష్టమైన విధానం తయారు చేసుకోవాలని సూచించారు. న్యాయపరమైన చిక్కులు రాకుండా చూడాలన్నారు. మూసీ ప్రాజెక్టు ఫేజ్ 2కి వీలైనంత త్వరగా టెండర్లను పిలవాలని తెలిపారు. ప్రాజెక్టుకు అతి తక్కువ వడ్డీకి వచ్చే రుణాలపైన మునిసిపల్ కమిషనర్లు దృష్టి సారించాలని సీఎం తెలిపారు. టీడీఆర్‌పై ప్రతి వారం సమీక్ష జరగాలని చెప్పారు. మంచిరేవుల ఓంకారేశ్వర స్వామి ఆలయం టెండర్లు తక్షణం పిలవాలని అదేశించారు. కొత్వాల్ గూడా బర్డ్స్ పార్కు మరింత ప్రచారం కల్పించాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి సూచనలు చేశారు. త్వరగా పనులు జరిగేలా చూడాలన్నారు. పనుల్లో ఆలస్యం తగదని, నిర్ణీత సమయంలోగా ప్రాజెక్టుల పూర్తికి ముందుకు సాగాలని అన్నారు. హెచ్ఎర్తో బోధి. పెవిలియన్లో జరిగిన ఈ సమావేశానికి సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, హెచ్ఎండిఎ కమిషనర్ సర్ఫ రాజ్ అహ్మద్, జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్, మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, సైబరాబాద్ కమిషనర్ సృజన, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి, మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి, ఎంఆర్డీసీఎల్ ఎండీ ఈ.వి.నరసింహ రెడ్డి, ఎంఆర్డీసీఎల్ జేఎండీ గౌతమి, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ముస్లింలకు సీఎం 'మిలాద్ ఉన్ నబీ' శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఆగస్టు 25, సిరి న్యూస్ :**

'మిలాద్ ఉన్ నబీ' పండగ సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ముస్లిం సోదర, సోదరీమణులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకునే ఈ పవిత్ర దినం ముస్లింలకు ఎంతో విశిష్టమైనదని పేర్కొన్నారు. ప్రవక్త మహ్మద్ బోధించిన శాంతి, ప్రేమ, సోదరభావం, కరుణ, మానవత్వం, ధర్మబద్ధమైన జీవన విధానం సమాజానికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని ముఖ్యమంత్రి అన్నారు. ఆయన సందేశాలు ప్రపంచ శాంతి, సామరస్యానికి మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు. ముస్లిం మైనారిటీల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా పాలనలో తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తుందని సీఎం స్పష్టం చేశారు. ముస్లింల సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల అభ్యున్నతికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని భరోసా ఇచ్చారు. మిలాద్ ఉన్ నబీ ప్రతి ఒక్కరి జీవితాల్లో శాంతి, సంతోషం, సౌభ్రాతృత్వాన్ని నింపాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# టిమ్స్‌లోనూ నిమ్స్ టారిఫ్‌ల అమలు

**హైదరాబాద్, ఆగస్టు 25, సిరి న్యూస్ :**

డాక్టర్ మర్రి చెన్నారెడ్డి టిమ్స్‌లో డాక్టర్లు, సిబ్బంది నియామకాల కోసం నిమ్స్ సర్వీస్ రూల్స్‌ను అనుసరించడంతోపాటు, నిమ్స్‌లో అమలులో ఉన్న టారిఫ్‌లను టిమ్స్‌లో కూడా అమలు చేయడానికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. నిమ్స్ టారిఫ్‌ల అమలు ద్వారా హాస్పిటల్ ప్రారంభ దశ నుంచే ఒక సమగ్రమైన టారిఫ్ విధానం అందుబాటులోకి రావడంతోపాటు, రాష్ట్రంలోని రెండు ప్రముఖ వైద్య సంస్థల మధ్య చార్జీల విధానంలో ఏకరూపత, మెరుగైన ఆర్థిక ప్రణాళికకు అవకాశం కలుగుతుందని ఈసీ అభిప్రాయపడింది. డాక్టర్ మర్రి చెన్నారెడ్డి తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(డాక్టర్ ఎంసీఆర్ టిమ్స్) ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ తొలి సమావేశం ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన మంగళవారం జరిగింది. టిమ్స్‌కు ప్రతి రోజూ సగటున 600మంది అవుట్ పేషెంట్లు వస్తున్నారని, వారికి అవసరమైన వైద్య సేవలు అందిస్తున్నామని డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ మంత్రికి వివరించారు. అలాగే డే కేర్ ప్రొసీజర్లను కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హాస్పిటల్‌లోని ఐసీయూలు, ఆపరేషన్ థియేటర్లు, డయాగ్నస్టిక్స్ పరికరాలతో పాటు ఇతర కీలక వైద్య పరికరాలను పూర్తిస్థాయిలో స్టెరిలైజ్ చేయిస్తున్నామని, ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే సర్జరీలు ప్రారంభిస్తామని డాక్టర్ నరేంద్ర కుమార్ వివరించారు. టిమ్స్‌కు సంబంధించిన ఆర్థిక లావాదేవీలను ట్రస్ట్ అండ్ రిటెన్షన్ అకౌంట్ ద్వారా నిర్వహించే విధంగా అవసరమైన బ్యాంకింగ్ సేవలను సమన్వయం చేయడానికి ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. టిమ్స్‌లో రోగులు, వైద్యులు, సిబ్బందికి అవసరమైన మౌలిక వసతులను మరింత మెరుగుపరిచే పలు ప్రతిపాదనలకు కూడా కౌన్సిల్ ఆమోదం తెలిపింది. స్టాఫ్, పేషెంట్లకు పార్కింగ్ ఇబ్బందులు లేకుండా మల్టీ లెవల్ కార్ పార్కింగ్, రోగుల సహాయకుల కోసం అదనపు టాయిలెట్ కాంప్లెక్స్ నిర్మించే ప్రతిపాదనలకు ఈసీ ఆమోదం తెలిపింది. నిమ్స్ తరహాలోనే టిమ్స్‌లోనూ పీజీ కాలేజీని ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో ఇందుకు అనుగుణంగా పీజీ విద్యార్థుల కోసం హాస్టళ్లు నిర్మించే ప్రతిపాదనకు ఈసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టిమ్స్‌ను అత్యాధునిక వైద్య సేవలు అందించే సంస్థగా తీర్చిదిద్దడంతో పాటు ప్రజలకు నాణ్యమైన సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడం, వైద్య విద్యపరిశోధనలను ప్రోత్సహించడం లక్ష్యంగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని మంత్రి దామోదర్ తెలిపారు. సమావేశంలో ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ వాణి, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రవీందర్ నాయక్, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# 'జీవో 97' రగడ!

**మొదటిపేజీ తరువాయి**

వ్యక్తమవుతున్నాయి.

**'శక్తి' స్కీమ్.. ఎందుకీ వ్యతిరేకత?**

రాష్ట్రంలోని సాంకేతిక విద్యను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చే లక్ష్యంతో ప్రభుత్వం నూతనంగా 'శక్తి' (స్కిల్ హ్యూమన్ కాపిటల్ అండ్ నాలెడ్జ్ ట్రైనింగ్ ఇనిషియేటివ్) విధానాన్ని తీసుకొచ్చింది. దీనిద్వారా తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌కు చెందిన పాలిటెక్నిక్ కళాశాలలను, ఐటీఐలను యంగ్ ఇండియా స్కిల్డ్ యూనివర్సిటీలో విలీనం చేసి ఆస్తులను బదిలీ చేయనున్నారు. అయితే 1984 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పాటై, 10వ తరగతి పూర్తయిన విద్యార్థులకు ఇంజనీరింగ్, కంప్యూటర్స్, ఆటోమొబైల్ కోర్సుల్లో 3 ఏళ్ల డిప్లొమా విద్యను అందిస్తున్న ఈ వ్యవస్థను రద్దు చేస్తే విద్యార్థుల అకడమిక్ గుర్తింపు దెబ్బతింటుందని మేధావులు ఆందోళన చెందుతున్నారు. కొత్త విధానంతో పాలిటెక్నిక్ విద్యార్థులకు డిమాండ్ ఉన్న ఉపాధి కోల్పోవడంతో పాటు, పాలిటెక్నిక్ నుంచి నేరుగా బీటెక్ ద్వితీయ సంవత్సరంలోకి ప్రవేశించే ఈసెట్ లేటరల్ ఎంట్రీ అవకాశం కూడా పోతుందని విద్యార్థులు ఆరోపిస్తున్నారు.

**కాలయాపనపై ఆగ్రహం**

గత నెల రోజులుగా పాలిటెక్నిక్ విద్యార్థులు శక్తి స్కీమ్ మరియు జీవో 97కు వ్యతిరేకంగా ఉద్యమిస్తుండటంతో, విద్యార్థుల ఆగ్రహాన్ని చల్లార్చేందుకు ప్రభుత్వం ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. పాలిటెక్నిక్‌లపై అధ్యయనం చేసి నివేదిక ఇచ్చేందుకు ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు చైర్మన్‌గా జీవో జారీ చేసింది. ఈ కమిటీలో సభ్యులుగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, రిటైర్డ్ ప్రొఫెసర్ శాంతా సిన్హా, ఇంధన శాఖ ప్రత్యేక కార్యదర్శి నవీన్ మిట్టల్‌లను నియమించగా, సాంకేతిక విద్య కమిషనర్‌ను కన్వీనర్‌గా నియమించారు. అయితే కమిటీల ఏర్పాటు కేవలం సమయం దాటవేసే ప్రసహనమేనని, విద్యార్థుల భవిష్యత్తును రక్షించాలంటే ప్రభుత్వం తక్షణమే జీవో 97ను రద్దు చేయాలని విద్యార్థి సంఘాలు భీష్మించుకున్నాయి.

**హరీష్ రావు తీవ్ర ఆగ్రహం**


ఈ వివాదంపై స్పందించిన బీఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో నిరుపేద విద్యార్థులకు ఉపాధి కల్పించే సాంకేతిక విద్యా వ్యవస్థను రద్దు చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆయన మండిపడ్డారు. ఈ కొత్త పాలసీ ద్వారా విద్యార్థులకు తీవ్ర నష్టం జరుగుతుందని, కేవలం పాలిటెక్నిక్ కళాశాలలకు ఉన్న వేల కోట్ల విలువైన ఆస్తులను అమ్ముకునేందుకే ప్రభుత్వం ఈ ప్రతిపాదనలు తెచ్చిందని తీవ్ర ఆరోపణలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కంటే ప్రభుత్వానికి రియల్ ఎస్టేట్ వ్యాపారమే ముఖ్యంగా మారిందని విమర్శించారు.

**సెప్టెంబర్ 7న అసెంబ్లీ ముట్టడి హెచ్చరిక**

విద్యార్థులు తమ హక్కుల కోసం శాంతియుతంగా నిరసనలు తెలుపుతుంటే ప్రభుత్వం కాలయాపన కోసం కమిటీలు వేస్తోందని హరీష్ రావు ఎండగట్టారు. వచ్చే సెప్టెంబర్ 7వ తేదీ లోపు జీవో 97ను పూర్తిగా రద్దు చేయకపోతే, తెలంగాణలోని 113 పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన లక్ష మంది విద్యార్థులతో ఢిల్లీ తరహా జంగ్ తిరుగుబాటు చేపడతామని, ఏకంగా తెలంగాణ అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ నిరసనల్లో బాధిత విద్యార్థులకు బిఆర్ఎస్ పార్టీ పూర్తిస్థాయిలో అండగా నిలుస్తుందని, ఎక్కడికక్కడ విద్యార్థుల ఆందోళనలకు బిఆర్ఎస్ నాయకులు మద్దతుగా నిలుస్తారని స్పష్టం చేశారు.

**చుట్టుముడుతున్న రాజకీయ ఒత్తిడి**

పాలిటెక్నిక్ విద్యార్థులు చేపట్టిన ఈ ఆందోళన




రోజురోజుకూ ఉధృతమవుతుండటంతో పాటు, ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌తో పాటు వివిధ ప్రతిపక్ష పార్టీలు, మేధావులు విద్యార్థుల పక్షాన నిలిచి మద్దతు తెలుపుతుండటంతో ప్రభుత్వానికి రాజకీయంగా తీవ్ర ఒత్తిడి పెరుగుతోంది. పాలిటెక్నిక్ విద్యార్థుల ఉద్యమం ఊపందుకున్న ఈ తరుణంలో విద్యార్థుల భవిష్యత్తును పరి పరి విధాలా ఆలోచించి ప్రభుత్వం జీవో 97ను రద్దు చేయడానికి దిగివస్తుందా లేదా కమిటీ నివేదిక పేరుతో తన నిర్ణయాన్నే కొనసాగిస్తుందా అనేది వేచి చూడాల్సి ఉంది.

# పవర్ ఎగ్జిబిషన్ విజయానికి కృషి చేసిన ఉద్యోగులకు సీఎండీ సన్మానం

**హైదరాబాద్, ఆగస్టు 25 (సిరి న్యూస్):**

తెలంగాణ విద్యుత్ వ్యవస్థ ప్రగతిని ప్రజలకు కళ్లకు కట్టినట్టు చూపిన ప్రతిష్ఠాత్మక 'పవర్ ఎగ్జిబిషన్2026' అత్యంత విజయవంతం కావడానికి అంకితభావంతో కృషి చేసిన విద్యుత్ అధికారులు, ఇంజినీర్లు మరియు సిబ్బందిని టీజీఎస్పీడీసీఎల్ ఛైర్మన్ & మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ మంగళవారం ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. హైదరాబాద్‌లోని మింట్ కాంపౌండ్‌లో ఉన్న టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో ఈ అభినందన సభను నిర్వహించారు. హైదరాబాద్ నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ ప్రదర్శనకు విద్యార్థులు, యువత, నిపుణులు, నగర ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి విద్యుత్ రంగ అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, భద్రతా ప్రమాణాలపై అవగాహన పొందారని సీఎండీ గుర్తు చేశారు. ఎగ్జిబిషన్ ఏర్పాట్లు, సందర్శకుల మార్గదర్శనం, సాంకేతిక స్టాల్స్ నిర్వహణ, భద్రతా చర్యలు, సాంస్కృతిక కార్యక్రమాల సమన్వయం వంటి ప్రతి అంశంలోనూ ఉద్యోగులు ప్రదర్శించిన పనితీరును ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (ప్రాజెక్ట్స్ అండ్ ఐటీ) వి.



శివాజీ, డైరెక్టర్ (ఆపరేషన్స్) డాక్టర్ ఎన్. నరసింహులు, డైరెక్టర్ (కమర్షియల్) చక్రపాణి, డైరెక్టర్ (ఫైనాన్స్) కృష్ణారెడ్డి తదితరులు పాల్గొని ఉద్యోగులను అభినందించారు. ప్రదర్శనలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందికి సీఎండీ చేతుల మీదుగా జ్ఞాపికలను అందజేశారు.

# యూఎస్ పర్యటనపై రేవంత్ వివరణ ఇవ్వాలి

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 25, సిరి న్యూస్ :**

అమెరికా పర్యటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి క్లారిటీ ఇవ్వాలని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాజకీయ కారణాలతోనే తన యూఎస్ పర్యటనను కేంద్రం అడ్డుకుందంటూ సీఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కిషన్ రెడ్డి తోసిపుచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం ఢిల్లీలో ఆయన స్పందించారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు అర్థరహితం అని కొట్టిపారేశారు. అనుమతులు లేకుండా ఎందుకు విదేశీ పర్యటనకు వెళ్లారంటూ తెలంగాణ సీఎంను ఆయన సూటిగా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి.. స్థాయికి తగినట్లుగా ఈ పర్యటన లేదని తెలిపారు.ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనపై తాము కొత్తగా నిబంధనలు పెట్టలేదని గుర్తు చేశారు. స్వాతంత్ర్యం నుంచి ఉన్న నిబంధనలే తాము అమలు చేశామని స్పష్టం చేశారు. ఇది సాధారణ పక్రియ.. ఇందులో రాజకీయాలకు తావు లేదన్నారు. భారత్‌పై విషం చిమ్మే వ్యక్తి న్యూయార్క్ మేయర్ మామ్దానీతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ కానున్నారంటూ వార్తలు వచ్చాయని వివరించారు. ప్రధాని మోదీని టెర్రరిస్ట్ అని న్యూయార్క్ మేయర్ వ్యాఖ్యానించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. మామ్ధానీను ఎందుకు కలుస్తున్నారో.. సీఎం రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.గతంలో తన విదేశీ పర్యటనను కూడా కేంద్ర విదేశాంగ శాఖ నిరాకరించిందని కిషన్ రెడ్డి తెలిపారు. మన దేశ ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకొని విదేశాంగ శాఖ ఈ నిర్ణయం తీసుకుందని అభిప్రాయపడ్డారు. గుజరాత్ సీఎంకు యూఎస్ పర్యటనకు అనుమతి ఇచ్చి.. తమకు అనుమతి ఇవ్వలేదని సీఎం రేవంత్ వాదించడం వితండవాదమని పేర్కొన్నారు. నరేంద్ర మోదీ సీఎంగా ఉన్నప్పుడు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఆయన విదేశీ పర్యటనను నిరాకరించిందని చెప్పారు. అయితే సీఎం రేవంత్ రెడ్డికి హార్వర్డ్ బిజినెస్ కోర్సు చదివేందుకు కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. కాంగ్రెస్ ముఖ్యమంత్రుల విదేశీ పర్యటనలను కూడా గతంలో రద్దు చేసిందని చెప్పారు. కుల గణన అంశంలో తెలంగాణ ప్రభుత్వం ఫెయిల్యూర్ అయిందని తెలిపారు. హైదరాబాద్‌లో 20 శాతం ఇళ్లలో కులగణన జరగలేదని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నేత రాహుల్ గాంధీకి కుల గణనపై అవగాహన లేదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఎద్దేవా చేశారు.

**సింగరేణి అభివృద్ధికి చొరవ**

గనుల శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత సింగరేణి సంస్థ అభివృద్ధి కోసం తాను అనేక చర్యలు తీసుకుంటున్నానని, సంస్థ దుబారా ఖర్చులు తగ్గించడం, ఉత్పత్తి పెంచడంతోపాటు బొగ్గు గనులను కేటాయించే విషయంలో చొరవ తీసుకుంటున్నానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. ఒడిశాలోని నైనీ కోల్ బ్లాక్ నుంచి యాదాద్రిలోని పవర్ ప్లాంట్‌కు బొగ్గు సరఫరా అయ్యేలా ఒప్పందం జరిగిందన్నారు. తాడిచర్ల2 కోల్ బ్లాక్ కూడా సింగరేణికి ఇచ్చేలా చొరవ చూపానని చెప్పారు. పీకేఓసీ 2ఓపెన్ కాస్ట్ డిప్‌సైడ్ బ్లాక్ కూడా సింగరేణికి వచ్చేలా అనేక మందితో మాట్లాడి చర్యలు తీసుకున్నాను. మరో బ్లాక్ కూడా సింగరేణికి వచ్చేలా ప్రయత్నిస్తున్నాం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కోయగూడెం బ్లాక్3 విషయంలోనూ సానుకూలత నెలకొందని అన్నారు. వేలంలో ఈ బొగ్గు గని దక్కించుకున్న ప్రైవేటు కంపెనీ సకాలంలో బొగ్గు ఉత్పత్తి చేయకపోవడంతో ఆ కంపెనీని రద్దు చేసి మళ్లీ వేలానికి తీసుకొచ్చామని, ఇప్పుడు ఈ బ్లాక్ కూడా కూడా సింగరేణికి వచ్చేలా చర్యలు తీసుకున్నామని ఆయన చెప్పారు. గతంలో ఈ గనిని రెండుసార్లు వేలం వేస్తే అప్పుడు అధికారంలో ఉన్న బీఆరఎస్ సింగరేణిని వేలంలో పాల్గొనకుండా చేయడంతో ప్రైవేటు కంపెనీకి వచ్చేలా చేశారని ఆరోపించారు. అయితే సకాలంలో ఉత్పత్తి ప్రారంభించకపోవడంతో ఆ కంపెనీ నుంచి ఆ బ్లాక్‌ను తిరిగి తీసుకున్నామని, ఈ కోయగూడెం బ్లాక్3 ద్వారా 120 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి అయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇక్కడ గ్రేడ్13 బొగ్గు ఇక్కడ అందుబాటులో ఉందన్నారు. సింగరేణి ఆర్థిక పరిస్థితి ఇబ్బందుల్లో ఉందని, ఓవర్ డ్రాఫ్ట్ తీసుకొచ్చి ఉద్యోగులు, కార్మికులకు జీతాలు ఇస్తున్న పరిస్థితి ఉందంటూ దీని నుంచి బయటపడాలంటే బొగ్గు ఉత్పత్తిలో నూతన బ్లాకులు సాధించుకోవడం తప్ప వేరే



మార్గం లేదని అన్నారు. సింగరేణికి ఇవ్వాల్సిన రూ.55 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన ఇవ్వాలన్నారు. బకాయిల విడుదలలో గతంలో బీఆరఎస్, ఇప్పుడు కాంగ్రెస్ వైఖరి ఒకేలా ఉందంటూ సింగరేణి కార్మికుల కష్టార్జితంగా వచ్చిన బొగ్గు డబ్బులను తిరిగి ఇవ్వకపోవడం రాష్ట్ర ప్రభుత్వానికి సమంజసం కాదని అన్నారు. రాష్ట్రప్రభుత్వం సానుకూలంగా ఆలోచించి త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కిషన్‌రెడ్డి కోరారు. మణుగూరు పీకేఓసీ డిప్‌సైడ్ బ్లాక్‌కు సంబంధించి కూడా జెన్‌కో వేలంలో పాల్గొందని, అయితే అందరితో మాట్లాడి ఆ బ్లాక్ సింగరేణికి వచ్చేలా చేశానని, ఇప్పుడు కూడా ఈ బ్లాక్ వచ్చేలా అందరూ సహకరించాలని కోరుతున్నానని అన్నారు.

# రైతులను చైతన్యపరచాలి



- **దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించాలి**
- **ఎల్ నినో, నీట్-పీజీ ఎంట్రెన్స్, పర్యాటకం అభివృద్ధిపై కలెక్టర్లతో సీఎస్ వీసీ**

**హైదరాబాద్, ఆగస్టు 25, సిరి న్యూస్ :**

రాష్ట్రంలో నెలకొన్న సీజనల్ పరిస్థితులు, నీట్‌పీజీ ప్రవేశ పరీక్ష నిర్వహణకు చేపట్టాల్సిన ఏర్పాట్లు, రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో పంట మార్పిడి విధానాలపై రైతులను మరింత చైతన్యపరిచి వ్యవసాయ సాగుకు అనుసరించాల్సిన నూతన విధానాలపై దృష్టి సారించాలని కలెక్టర్లను ఆదేశించారు. జిల్లాల వారీగా సీజనల్ పరిస్థితులు, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకుంటున్న ముందస్తు చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాతావరణ పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైనచోట తక్షణ చర్యలు చేపట్టాలని కలెక్టర్లను ఆదేశించారు. అంచనా వేస్తున్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రూపొందించిన ప్రత్యామ్నాయ పంటల(కాంటింజెన్సీ క్రాప్) ప్రణాళికను సమర్థవంతంగా అమలు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలన్నారు. పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) అవసరాన్ని చెబుతూ తక్కువ నీటి అవసరం ఉండే, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన పంటలను సాగు చేసేలా రైతులకు నిరంతరం అవగాహన కల్పించాలని సూచించారు. పంటల వైవిధ్యీకరణ వ్యూహంలో భాగంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, కూరగాయలు, ఉద్యాన పంటల సాగును ప్రోత్సహించేందుకు క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులను సీఎస్ ఆదేశించారు.

**నీట్- పీజీ ప్రవేశ పరీక్ష ఏర్పాట్లపై..**

ఈ నెల 30న జరగనున్న నీట్‌పీజీ ప్రవేశ పరీక్ష సజావుగా, ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించేందుకు జిల్లాల్లో చేపడుతున్న ఏర్పాట్లను సీఎస్ సమీక్షించారు. పరీక్షా కేంద్రాల వద్ద అవసరమైన మౌలిక సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, విద్యుత్, తాగునీరు, రవాణా తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పరీక్షను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చూడాలని ఆదేశించారు. హైదరాబాద్, మేడ్చల్‌మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మరో 30 సెంటర్లలో ఈ పరీక్ష జరగనున్నందున కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు, నిరంతర విద్యుత్ సరఫరా, తదితర మౌలిక సదుపాయాలను కల్పించాలని కలెక్టర్లను ఆదేశించారు. దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పరీక్షకు ఎలాంటి అవాంతరాలు లేకుండా సజావుగా జరిగేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్లను ఆదేశించారు.

**పర్యాటక అభివృద్ధికి ప్రణాళికాబద్ధమైన చర్యలు**

తెలంగాణ టూరిజం2047 పాలసీలో భాగంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసి, దేశీయ, అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ సూచించారు. ప్రతి జిల్లాలో ఉన్న ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలను గుర్తించి అక్కడ అవసరమైన మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, పరిశుభ్రత, సౌకర్యాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్లకు సూచించారు. జిల్లాల ప్రత్యేకతలు, చారిత్రక, సాంస్కృతిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకోవాలన్నారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధికి 27 స్పెషల్ టూరిజం ప్రదేశాలు(ఎస్‌టిఏ)లను గుర్తించిందని, ఆ ప్రదేశాలను మరింత అభివృద్ధి చేసి టూరిజం సెక్టార్‌ను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు జిల్లా కలెక్టర్లు కృషి చేయాలని సీఎస్ అన్నారు. తెలంగాణ బ్రాండ్‌ను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తరించేందుకు ఈ టూరిజం20247 ప్రణాళికలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. స్పిరిచ్చువల్, హెరిటేజ్, ఎకో టూరిజం, క్రాఫ్ట్స్ టూరిజం విస్తరణకు అధికారులు తగు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో స్పెషల్ సీఎస్(వైఏటీసీ) వాణిప్రసాద్, వైద్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా చొంగ్తూ, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, పోలీస్ శాఖ డీజీ మహేశ్ భగవత్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# సురేఖ, చిన్నారెడ్డి ఔట్?

మొదటిపేజీ తరువాయి

సురేఖ. చిన్నారెడ్డిపై చర్యలకు కమిటీ సిఫార్సు చేసినట్లు సమాచారం. కుమార్తె సుస్మిత వ్యాఖ్యలను సురేఖ ఖండించాల్సిందని కమిటీ అభిప్రాయపడి నట్లు తెలుస్తోంది. మొత్తంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కి క్రమశిక్షణా కమిటీ సమర్పించిన నివేదిక రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తోంది. బీసీ సంక్షేమ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో పాటు ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డిలను వారి పదవుల నుంచి తక్షణమే తప్పించాలని కమిటీ తన నివేదికలో స్పష్టంగా సిఫార్సు చేసినట్లు సమాచారం. వీరిద్దరి వైఖరి, వివాదాస్పద వ్యాఖ్యలు, శైలి వల్ల పార్టీకి మాత్రమే కాకుండా, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వానికి కూడా ప్రజల్లో తీవ్ర చెడ్డపేరు వస్తోందని కమిటీ తన నివేదికలో కుండబద్దలు కొట్టింది. సీనియర్ నాయకులుగా ఉండి పార్టీ రహితమైన, వివాదాస్పద రీతిలో ప్రవర్తించడం వల్ల ప్రభుత్వ ఇమేజ్ దెబ్బతింటోందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. పదవుల నుంచి తొలగించాలని సిఫార్సు.. అధిష్టానం నిర్ణయంపై ఉత్కంఠ ఏర్పడింది. కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో ఐక్యతను కాపాడటానికి, ప్రభుత్వ ప్రతిష్టను దిగజార్చే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని క్రమశిక్షణా కమిటీ అభిప్రాయపడింది. అందుకే మంత్రి కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించాలని, అలాగే చిన్నారెడ్డిని ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి తప్పించాలని సిఫార్సు చేస్తూ ఉన్నత స్థాయికి నివేదికను పంపినట్లు తెలుస్తోంది. క్రమశిక్షణా కమిటీ ఇచ్చిన ఈ కీలక నివేదిక కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారగా, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అధిష్టానం ఏ విధమైన కఠిన నిర్ణయం తీసుకుంటారో నన్న ఉత్కంఠ ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో నెలకొంది. నివేదిక సమర్పించిన అనంతరం గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ మల్లు రవి డియాతో మాట్లాడారు. కొండా సురేఖ, చిన్నారెడ్డి ఇచ్చిన వివరణ ఆధారంగా పీసీసీ అధ్యక్షుడికి నివేదిక ఇచ్చామని చెప్పారు. కాంగ్రెస్ గౌరవాన్ని దెబ్బతీసే పనులు ఎవరూ చేయొద్దని.. వచ్చే ఎన్నికల్లో పార్టీకి నష్టం కలిగేలా ఎవరూ మాట్లాడవద్దన్నారు. అన్ని అంశాలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక ఇచ్చాం. హద్దులు దాటిన నేతలందరికీ స్పష్టమైన హెచ్చరిక ఇవ్వాల్సిన అవసరం ఉంది. క్రమశిక్షణా చర్యలు కఠినంగా ఉండాలని నివేదిక ఇచ్చాం అన్నారు. అందులో ఏముందో ముందే చెబితే అధిష్ఠానం నుంచి నాకు నోటీసులు వస్తాయి. పార్టీ అంతర్గత వ్యవహారాలను ఎవరూ బయట పెట్టొద్దని ప్రధానంగా నివేదికలో పేర్కొన్నాం. కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యక్తిగతంగా కలవలేదు. గాంధీభవన్‌లో వివరణ లేఖ ఇచ్చి వెళ్లారు. ఈ నివేదికను సీఎం రేవంత్‌కు ఇవ్వలేదు. పార్టీకి సంబంధించిన విషయం కాబట్టి పీసీసీ అధ్యక్షుడికి అందజేశాం. ఈ విషయంలో ఊహాజనిత అంశాలు ప్రచారం చేయొద్దని మల్లు రవి అన్నారు. అయితే కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పీసీసీ అధ్యక్షుడికి సమర్పించిన నివేదికలో క్రమశిక్షణ కమిటీ పలు సిఫార్సులు చేసినట్లు సమాచారం. పార్టీ నియమాలను కొండా సురేఖ ఉల్లంఘించడం ఇది మూడోసారి. ఇంకా ఉపేక్షిస్తే పార్టీకి తీరని నష్టం వాటిల్లుతుందని, సురేఖను మంత్రి పదవి నుంచి తొలగించాలని సిఫార్స్ చేసినట్లు తెలుస్తోంది. సీనియర్ నేతగా ఉన్న చిన్నారెడ్డి పార్టీలో సుదీర్ఘ కాలం ఎన్నో పదవులు అనుభవించారు. క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్‌గానూ పనిచేశారు. ఆయన కూడా పార్టీకి నష్టం కలిగించేలా మాట్లాడారు. క్యాబినెట్ ర్యాంకు పదవిలో ఉన్న చిన్నారెడ్డిని కూడా ఆ పదవి నుంచి తొలగించాలని క్రమశిక్షణ కమిటీ సిఫార్సు చేసినట్లు తెలుస్తోంది. కమిటీ నివేదిక నేపథ్యంలో ఈ ఇద్దరు నేతలపై కాంగ్రెస్ పార్టీ తీసుకునే నిర్ణయంపై ఉత్కంఠ నెలకొంది. మంత్రి కొండా సురేఖ, చిన్నారెడ్డిపై పూర్తి అంశాలతో నివేదికను పొందుపరిచి టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌కు అందజేశారు. దీనిని పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ నాక్షి నటరాజన్‌కు పంపారని తెలిపారు. మంగళవారం వీరిపై డియాలో వచ్చిన కథనాలను చూసి ఓ అంచనాకు వచ్చామని మల్లు ర వి పేర్కొన్నారు. అలాగే గత విషయాలను కూడా పరిగణలోకి తీసుకున్నామని వివరించారు. ఈ నివేదికను ఏఐసీసీ చీఫ్, పార్టీ జనరల్ సెక్రటరీకి కూడా పంపిస్తారని అన్నారు. కాంగ్రెస్ హై కమాండ్ ఆదేశాల మేరకు వారిపై చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో నాయకులు, క్యాడర్‌కు ఒక మెసేజ్ ఇవ్వాలని అనుకుంటున్నామని మల్లు రవి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కమిటీలో క్రమశిక్షణ ప్రధానమైనదని పేర్కొన్నారు. క్రమశిక్షణపైనే పార్టీ గౌరవం ఆధారపడి ఉంటుందన్నారు. ఆ గౌరవం ఉంటేనే మళ్ళీ పార్టీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. పార్టీపై నెగెటివ్ అభిప్రాయాన్ని కలిగించకుండా ఉండాలంటే క్రమశిక్షణ చర్యలు తీసుకోవాల్సిందని అభిప్రాయపడ్డారు. అధిష్ఠానం దీనిపై సక్షించి ఏ నిర్ణయం తీసుకున్నా, ఆ వివరాలను డియా ద్వారా వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

## బీఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డుకు దిక్కేలేదు

- గ్రామాల్లో పర్యటించిన మంత్రి పొన్నం



సిద్దిపేట, ఆగస్టు 25 :

బీఆర్ఎస్ పాలనలో ఒక్క రేషన్ కార్డు కూడా అర్హులకు అందలేదని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. సైదాపూర్ మండలంలోని పలు గ్రామాలలో 'పల్లె పల్లెకు ప్రజాపాలన.. పల్లె పల్లెకు పొన్నం' కార్యక్రమంలో భాగంగా సర్వాయిపేట, పెరిక పల్లి, గొల్లగూడెం, ఆకునూరు, వెంకటేశ్వర్ల పల్లి గ్రామాలలో మంగళవారం పర్యటించారు. గ్రామాలలో నెలకొన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించే దిశగా ఈ కార్యక్రమం రూపొందించినట్లు తెలిపారు. ప్రజా పాలనలో రైతు సంక్షేమంతోపాటు, రాష్ట్రంలో అనేక వినూత్న పథకాలను అమలు చేస్తూదేశంలోనే రాష్ట్రం ఆదర్శంగా నిలుస్తుంది అన్నారు. అర్హులకు ఇందిరమ్మ ఇండ్లతో పాటు, పేదలకు సన్న బియ్యం, రేషన్ కార్డుల పంపిణీ, రైతులకు రుణమాఫీ, రైతు భరోసా వంటి కార్యక్రమాలను చేపడుతూ కాంగ్రెస్ పార్టీ పేదల పక్షపాతంగా పనిచేస్తుందన్నారు.అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్షించి, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకున్నారు. అర్హులైన లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. గ్రామంలో 8 ఇందిరమ్మ ఇళ్లు పూర్తవడం, రైతులకు రుణమాఫీ, రైతుభరోసా, రైతుబీమా, గృహజ్యోతి, మహాలక్ష్మి పథకాల ద్వారా లబ్ది చేకూరడం జరిగింది. గ్రామంలో అంతర్గత సీసీ రోడ్లు, తాగునీరు, వాటర్ ప్లాంట్, పంచాయతీ భవనం తదితర సమస్యలను దశలవారీగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. జలసిరి కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటా ఇంకుడు గుంతలు నిర్మించుకోవాలని, రైతులు ఆరుతడి పంటలు, ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. వన మహోత్సవంలో ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు. గొల్లగూడెం గ్రామాభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు స్వరూప, బాబిత, మౌనిక, స్వతంత్ర, చంద్రయ్య, మండల డివిజన్ జిల్లా స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నగరంలో నకిలీ వైద్యుల దందా

మొదటిపేజీ తరువాయి

సృష్టించిన నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లను అడ్డుపెట్టుకుని, వీరు నగరంలోని పలు కీలక ప్రాంతాల్లో ఏకంగా క్లినిక్‌లు తెరిచి ప్రాక్టీస్ చేస్తున్నారు. ఎటువంటి అర్హత లేకపోయినా రోగులకు అల్లోపతి వైద్యం అందిస్తూ ప్రజల ప్రాణాలతో ఆడుకుంటున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది. వీరు నగరంలో ఎక్కడెక్కడ క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు? ఏయేవిశ్వవిద్యాలయాల నుంచి నకిలీ సర్టిఫికెట్లు పొందుపరిచారు? రోగులకు ఎలాంటి వైద్యం, మందులు అందిస్తున్నారు? అనే కీలక అంశాలపై పోలీసులు ప్రస్తుతం లోతుగా విచారణ జరుపుతున్నారు. అర్హత లేని నకిలీ వైద్యుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. నకిలీ ధ్రువపత్రాలతో వీరంతా వైద్యులుగా చలామణి అవుతున్నారు. ఇలా 11 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్, సికింద్రాబాద్ జోన్లలో ప్రత్యేక ఆపరేషన్ పేరిట పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. అర్హత లేకున్నా క్లినిక్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు సెలైన్లు, ఇంజక్షన్లు, మందులు ఇస్తున్నట్లు గుర్తించినట్లు టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. పారామెడికల్ కోర్సు చేసిన ఓ మహిళ అనుమతులు లేకుండా నాలుగేళ్లుగా క్లినిక్ నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. పట్టుబడిన 11 మంది నకిలీ వైద్యులను అదుపులోకి తీసుకుని మందులను స్వాధీనం చేసుకున్నారు.

# వన మహోత్సవ లక్ష్యాన్ని చేరుకోవాలి

మొదటిపేజీ తరువాయి

అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలోని వివిధ కార్యక్రమాల పురోగతిని సమీక్షించారు. ఇతర శాఖల పరిధిలో వన మహోత్సవ కార్యక్రమాలు ఇటీవల ప్రారంభమైనప్పటికీ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో ముందుగానే ప్రారంభించి ఇప్పటికే 86 శాతం లక్ష్యాన్ని పూర్తి చేశామని మంత్రి సీతక్క తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 6.18 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటివరకు 5.32 కోట్లకు పైగా మొక్కలు నాటినట్లు చెప్పారు. ఇది గణనీయమైన పురోగతి అని పేర్కొంటూ మిగిలిన లక్ష్యాన్ని కూడా వర్షాలు అనుకూలంగా ఉన్న ప్రస్తుత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎండాకాలంలోనే ఉపాధి హామీ కూలీల సహకారంతో మొక్కలు నాటేందుకు గుంతలు సిద్ధం చేశామని, ఎల్‌నినో పరిస్థితులు ఉన్నప్పటికీ తొలి వర్షాలు పడగానే మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించామని మంత్రి తెలిపారు. ఇప్పుడు 86 శాతం లక్ష్యం పూర్తయిన నేపథ్యంలో నాటిన మొక్కలు ఏ మేరకు ఎదుగుతున్నాయి, వాటి మనుగడ ఎలా ఉంది అన్నదానిపై క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని సూచించారు. వాగులు, వంకలు, రహదారులకు ఇరువైపులా, చెరువుల పరిసరాలు, శ్మశాన వాటికలు, పార్కులు, ప్రభుత్వ స్థలాలు తదితర ప్రాంతాలను వినియోగించుకుని మిగిలిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు.

**ప్రతీ మొక్కను కాపాడాలి**

మొక్కలు నాటడంతో కార్యక్రమం పూర్తయినట్లు భావించక వాటి సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి సీతక్క సూచించారు. వర్షాలు లేని రోజుల్లో క్రమం తప్పకుండా నీరు అందించాలని, ప్రతి మొక్క చుట్టూ నీరు నిలిచేలా గుంతలు, తట్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. మొక్కలకు రక్షణ కంచెలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని, ముఖ్యంగా అవెన్యూ ప్లాంటేషన్లలో ఫెన్సింగ్ పటిష్టంగా ఉండేలా చూడాలని ఆదేశించారు. చనిపోయిన మొక్కల స్థానంలో వెంటనే ప్రత్యామ్నాయ మొక్కలు నాటి 100 శాతం మనుగడ సాధించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నాటిన మొక్కల వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, క్షేత్రస్థాయి సిబ్బంది మొక్కల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. పండ్ల మొక్కలకు ప్రాధాన్యత ఇవ్వాలని, స్థానిక వాతావరణానికి అనువైన ఇప్ప, తునికి, అడవి మామిడి వంటి మొక్కలను కూడా ప్రోత్సహించాలని మంత్రి సూచించారు. దీంతో పర్యావరణ పరిరక్షణతోపాటు గ్రామీణ ప్రజలకు, వన్యప్రాణులకు కూడా ప్రయోజనం కలిగేలా కార్యక్రమాన్ని బహుళ ప్రయోజన కార్యక్రమంగా తీర్చిదిద్దవచ్చన్నారు. ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు, విద్యార్థులు, యువతను భాగస్వాములను చేసి వన మహోత్సవాన్ని ప్రజా ఉద్యమంగా మార్చాలన్నారు.

**ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడమే ప్రథమ బాధ్యత**

ప్రతి గ్రామ పంచాయతీలో రోజుకు కనీసం 60 మంది కూలీలకు ఉపాధి కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. పనికి సిద్ధంగా ఉన్న ప్రతి కూలీకి పని అందాలని, కూలీలు తమ నివాస ప్రాంతానికి సమీపంలోనే పని పొందేలా ప్రతీ ఆవాసంలో తగిన పనులను ప్రారంభించాలని సూచించారు. ప్రతి గ్రామ పంచాయతీలో సరిపడ పనుల షెల్ఫ్ సిద్ధంగా ఉంచాలని, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బందికి కూలీల సమీకరణ బాధ్యతలను స్పష్టంగా అప్పగించాలని సూచించారు. ఎనఎంఎంఎస్ హాజరును ప్రతిరోజూ పర్యవేక్షించాలని ఆదేశించారు. కూలీలు ఉపాధికి సిద్ధంగా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో వారి హాజరు ఆశించిన స్థాయిలో లేదని మంత్రి అన్నారు. తక్కువ పనితీరు ఉన్న మండలాలు, గ్రామాలపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పష్టమైన కార్యాచరణ రూపొందించాలని సూచించారు.

**ఫార్మ్ పాండ్లు.. నీటి సంరక్షణకు శాశ్వత ఆస్తులు**

మంజూరైన అన్ని ఫార్మ్ పాండ్ల పనులను వెంటనే ప్రారంభించాలని సీతక్క ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 13,046 ఫార్మ్ పాండ్ల లక్ష్యానికి గాను 8,924 పనులు మంజూరయ్యాయని, అయితే గ్రౌండింగ్ పూర్తయినవి తక్కువగా ఉన్నాయని, పనుల వేగం పెంచాలని ఆదేశించారు. ఉపాధి హామీ ద్వారా కూలీలకు పని కల్పించడంతోపాటు ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, ఇతర నీటి సంరక్షణ పనులను భవిష్యత్తు తరాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తులుగా అభివృద్ధి చేయాలని అన్నారు. ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో భూగర్భ జలాల రీచార్జ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, స్థానిక వాగులు, వంకలు, నీటి ప్రవాహ మార్గాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో వీబీజీరామ్‌జీ చెక్‌డ్యామ్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, నిల్వ చేసిన నీటిని పశువులు, ఇతర జీవజాలం దాహార్తిని తీర్చేందుకు ఉపయోగపడేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు. బోర్‌బావులు, మోటార్లపైనే ఆధారపడక వర్షపు నీటిని భూమిలోకి ఇంకేలా చర్యలు చేపట్టాలని, సాధ్యమైనచోట కాల్వల అనుసంధానం, వాగులు వంకల నీటి వినియోగంపై అధ్యయనం చేయాలని అధికారులకు సూచించారు.

**ఏజెన్సీ ప్రాంతాల్లో నీటి సంరక్షణకు ప్రాధాన్యత**

ఆదివాసీ, గిరిజన ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఫార్మ్ పాండ్లు, ఇంకుడు గుంతలు, ఇతర నీటి సంరక్షణ పనులను వేగంగా ప్రారంభించి గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల సృష్టి ఏకకాలంలో జరిగేలా కార్యాచరణ రూపొందించాలని అన్నారు. ఫార్మ్ పాండ్లను వెంటనే గ్రౌండ్ చేసి తక్కువ పనితీరు ఉన్న జిల్లాలకు ప్రత్యేక లక్ష్యాలు నిర్దేశించి నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు.

**చేయూత పెన్షన్లపై క్షేత్రస్థాయిలో సమగ్ర పరిశీలన**

చేయూత పెన్షన్లకు సంబంధించి అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క ఆదేశించారు. సెప్టెంబర్ నుంచి కొత్త పెన్షన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి దరఖాస్తును జాగ్రత్తగా పరిశీలించి అర్హతను నిర్ధారించాలని సూచించారు. అర్హులైన వారికి ఎలాంటి ఇబ్బంది లేకుండా పెన్షన్ అందేలా చూడటంతోపాటు, మరణించిన వ్యక్తుల పేర్లపై పెన్షన్లు కొనసాగకుండా రికార్డులను క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించాలన్నారు.

**మహిళా సంఘాల గౌరవం నిలిచేలా యూనిఫామ్‌ల తయారీ**

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల యూనిఫామ్‌లను కుట్టే అవకాశం మహిళా సంఘాలకు లభించిందని మంత్రి సీతక్క పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మహిళా సంఘాల ఆర్థిక సాధికారతకు మరింత బలం చేకూర్చే విధంగా వినియోగించుకోవాలన్నారు. యూనిఫామ్‌లలో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని, నాణ్యతను కాపాడుతూనే నిర్ణీత సమయంలో సరఫరా పూర్తి చేయాలని సూచించారు.

**పనితీరును ప్రోత్సహించే వారికి గుర్తింపు**

వన మహోత్సవం, ఉపాధి హామీ, నీటి సంరక్షణ తదితర కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి మంచి ఫలితాలు సాధించే అధికారులు, సిబ్బందిని ప్రోత్సహిస్తామని మంత్రి సీతక్క తెలిపారు. ఉత్తమ పనితీరు కనబరిచిన వారికి గాంధీ జయంతి సందర్భంగా ప్రోత్సాహకాలు అందించే అంశాన్ని పరిశీలిస్తామని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను కేవలం కాగితాలపై కాక క్షేత్రస్థాయిలో ఫలితాలుగా చూపాలని, ప్రతీ కార్యక్రమం పురోగతిని ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేయాలని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్రామీణాభివృద్ధి అంటే పనులు కల్పించడం మాత్రమే కాదని, ఉపాధితోపాటు పర్యావరణ పరిరక్షణ, నీటి సంరక్షణ, జీవనోపాధి ఆస్తుల సృష్టి, మహిళల ఆర్థిక సాధికారతను సమగ్రంగా ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ దివ్య, స్పెషల్ కమిషనర్ శ్రీలక్ష్మి, జిల్లా సీఈవోలు, డీఆర్డీవోలు, డీపీవోలు, అదనపు డీఆర్డీవోలు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు మంత్రి సీతక్క తన నివాసం ప్రజా భవన్‌లో ప్రత్యేక వనమహోత్సవంలో భాగంగా మామిడి మొక్క నాటి పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకత వివరించారు.

## ఇందిరమ్మ టవర్స్ కు వడివడిగా అడుగులు

మొదటిపేజీ తరువాయి

శ్రీనివాసరెడ్డి తెలిపారు. హౌసింగ్ శాఖ ఉన్నతాధికారులతో సచివాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పురోగతి, లబ్దిదారుల ఎంపిక, లక్కీ డ్రా నిర్వహణ, కొత్త నియోజకవర్గాల్లో దరఖాస్తుల స్వీకరణ తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి సంబంధించి ఇప్పటికే టెండర్ల ప్రక్రియను పూర్తిచేశామని వెల్లడించారు. క్యూఆర్ పరిధిలోని తొలి విడతలో ప్రయోగాత్మకంగా 16 నియోజకవర్గాల్లో రూ.807.40 కోట్ల అంచనా వ్యయంతో ఇందిరమ్మ టవర్స్ నిర్మిస్తున్నామని, ఇందుకోసం జూన్ 20 నుంచి ఆగస్టు 15వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించగా మొత్తం 60,720 దరఖాస్తులు అందాయని, వచ్చిన దరఖాస్తులపై 360 డిగ్రీల క్షేత్రస్థాయి పరిశీలన, సమగ్ర విచారణ అనంతరం 40,900 మందిని అర్హులుగా గుర్తించామన్నారు. అనర్హతకు గల కారణాలను దరఖాస్తుల వారీగా వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు మంత్రి తెలిపారు. ఈనెల 28, 29, 30 , 31తేదీల్లో ఆయా ప్రాంతాల్లోని ప్రత్యేక ఫంక్షన్ హాళ్లలో ప్రజలు, అర్హులైన దరఖాస్తుదారుల సమక్షంలోనే పారదర్శకంగా లక్కీ డ్రా నిర్వహిస్తామని, ప్రతి కేంద్రానికి ఒక ప్రత్యేక పర్యవేక్షణాధికారిని కూడా నియమించామని తెలిపారు. లక్కీ డ్రా ద్వారా లబ్దిదారుల తుది జాబితా ప్రకటించిన తర్వాత ఎంపిక కాని దరఖాస్తుదారులకు వారు చెల్లించిన రూ.10,000 ఈఎండీ మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లోకి తిరిగి జమ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. 28న రాయదుర్గం, కేపీహెచ్‌బీ కాలనీ, మైలార్‌దేవ్‌పల్లి, రెడ్‌హిల్స్, 29న కౌకూర్, పాటిగడ్డ, జల్‌పల్లి, కుల్సుంపుర, 30న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే కాలనీ, బోయిన్‌పల్లి, బండ్లగూడ(ఎలఐజి కాలనీ), నందిముసలిగూడ, 31న గాజులరామారం, అంబర్పేటలోని సిటీ పోలీస్ లైన్స్, గడ్డిఅన్నారం, ఆర్అండ్‌బి క్వార్టర్స్, పోచారం(ఎల్ఐజి కాలనీ)లో లక్కీ డ్రా నిర్వహించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు.

**మరో నాలుగు నియోజకవర్గాల్లో స్థలాల ఎంపిక**

క్యూర్ పరిధిలో కొత్తగా మరో నాలుగు నియోజకవర్గాల్లో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణానికి స్థలాలను ఎంపిక చేశామని , ఒక్కో నియోజకవర్గంలో 480 ఇళ్ల చొప్పున మొత్తం 1,920 ఇళ్ల నిర్మించేందుకు చర్యలు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో హయత్‌నగర్ గ్రామంలోని అమంగల్, గోషామహల్ నియోజకవర్గంలోని నాంపల్లి, ముషీరాబాద్ నియోజకవర్గంలోని జమిస్తాన్‌పూర్(ఆర్టీసీ క్వార్టర్స్), చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలోని బండ్లగూడలో(ఫలక్‌నుమా సమీపంలో) ఇళ్లు నిర్మించేందుకు వీలుగా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ నాలుగింటి పరిధిలోని అర్హులైన ప్రజలు ఇందిరమ్మ టవర్స్ కోసం సెప్టెంబర్ 3వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మంత్రి పొంగులేటి తెలిపారు. గతంలో 16 నియోజకవర్గాలకు వర్తింపజేసిన నిబంధనలే ఈ కొత్త నియోజకవర్గాలకూ వర్తిస్తాయన్నారు.

## సర్కార్‌పై పోరాటం ఆగదు

హైదరాబాద్, ఆగస్టు 25, సిరి న్యూస్ :

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు చేపట్టిన మహా నిరాహార దీక్ష ముగిసింది. . ధర్నా చౌక్ వద్ద పోలీసులు అనుమతి నిరాకరించడం తో రామచందర్ రావు పార్టీ కార్యాలయ ప్రాంగణంలో నిరాహార దీక్షను ప్రారంభించారు. . యువమోర్చా(బీజేవైఎం) సేకరించిన ఐదు లక్షలమంది విద్యార్థుల సంతకాల పత్రాలను ఈ సందర్భంగా సమర్పించి కాంగ్రెస్ సర్కార్‌కు హెచ్చరిక చేసింది. బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర పదాధికారులు, వివిధ జిల్లాల అధ్యక్షులు దీక్షా శిబిరానికి తరలివచ్చి మద్దతు పలికారు. వీరితోపాటు డిగ్రీ కాలేజ్ అసోసియేషన్ అధ్యక్షుడు, వివిధ విద్యాసంస్థల అధినేతలు, కాలేజీ యాజమాన్యాలు, అధ్యాపకులు, లెక్చరర్లు, ఉద్యోగులు, న్యాయవాదులు, డాక్టర్లు, కార్మిక సంఘాల నేతలు, ఎక్స్‌సర్వీస్‌మెన్ సంఘాల ప్రతినిధులు తరలివచ్చి ఫీజు బకాయిల సాధనలో బీజేపీకి అండగా ఉంటామని తెలిపారు . ఈ సందర్భంగా దీక్షా ప్రాంగణంలో బీజేపీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై, రాహుల్ గాంధీ ద్వంద్వ వైఖరిపై నిప్పులు చెరిగారు. విద్యాశాఖ మంత్రిగా కూడా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విద్యార్థుల గోడు పట్టదు కానీ.. హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ అంటూ విదేశాల్లో విహరించడానికి సమయం దొరుకుతుందని విమర్శించారు. ఇతర రాష్ట్రాల్లో తిరుగుతూ 'ఛాత్రోం కీ గూంజ' అని విద్యార్థుల కోసం పోరాడుతున్నట్లు నాటకాలు ఆడే రాహుల్ గాంధీకి కాంగ్రెస్ పాలిత తెలంగాణలో విద్యార్థుల రోదన ఎందుకు వినపడటం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే రూ.15వేల కోట్ల ఫీజు బకాయిలను చెల్లించకపోతే విద్యార్థులతో కలిసి సచివాలయాన్ని ముట్టడించి కాంగ్రెస్‌ను గద్దె దించుతామని నేతలు తీవ్ర స్థాయిలో హెచ్చరించారు.

**వైద్యుల హెచ్చరిక**

దీక్ష రామచందర్ రావు రక్తపోటు పడిపోవడం, షుగర్ లెవెల్స్ తగ్గడంతో ఆరోగ్యం క్షీణించింది. వైద్య బృందం ఆయన ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి దీక్షను కొనసాగిస్తే ఆయన ఆరోగ్యానికి ప్రమాదం ఉందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధుల బలవంతపు విజ్ఞప్తి మేరకు, వైద్యుల సలహాను పాటించి రామచందర్ రావు దీక్షను విరమించారు. రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ చేతుల మీదుగా బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఇతర ముఖ్య నేతలు రామచందర్ రావుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. దీక్ష విరమణ అనంతరం రామచందర్‌రావు మాట్లాడుతూ నిరాహార దీక్ష ముగిసినా విద్యార్థుల హక్కుల కోసం బీజేపీ పోరాటం ఆగదన్నారు. ప్రభుత్వం మొండివైఖరి వీడి రూ.15వేల కోట్ల బకాయిలను చెల్లించేవరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసి, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిద్రపోనివ్వమని హెచ్చరించారు. విద్యార్థులకు న్యాయం జరగకపోతే త్వరలోనే సచివాలయాన్ని ముట్టడించి కాంగ్రెస్ మెడలు వంచుతామని స్పష్టం చేశారు. ఈ పోరాటానికి అండగా నిలిచిన విద్యార్థి లోకానికి, యువతకు, మేధావులకు, విద్యాసంస్థల ప్రతినిధులకు, పార్టీ శ్రేణులకు బీజేపీ నాయకత్వం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో శాసనమండలిలో బీజేపీ పక్షనేత ఏవీఎన్ రెడ్డి, బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, రేఖా శర్మ, మల్కాజ్‌గిరి, మెదక్, నిజామాబాద్, చేవెళ్ల ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, ధర్మపురి అర్వింద్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్‌బాబు, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, వెంకట రమణారెడ్డి, రాకేష్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎన్.గౌతం రావు, వీరేందర్ గౌడ్, వేముల అశోక్, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, రాష్ట్ర పదాధికారులు, వివిధ జిల్లాల అధ్యక్షులు, అనుబంధ మోర్చాల నేతలు, పార్టీ ముఖ్య నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**విద్యార్థుల భవిష్యత్తును కాపాడే బాధ్యత బీజేపీది : ఈటల**

విద్యార్థుల భవిష్యత్తును కాపాడే బాధ్యతను బీజేపీ తీసుకుందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. 'తాను లండన్ పోయినా.. అమెరికాకు పోయినా అంటూ ముఖ్యమంత్రి రేవంత్ లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం గురించి మాట్లాడుతున్నారన్నారు. కానీ ముఖ్యమంత్రి గారూ.. ఒక్కసారి రాష్ట్రంలోని విద్యార్థుల పరిస్థితి గురించి కూడా ఆలోచించండన్నారు. నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల గురించి ఆలోచించాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిదేనన్నారు. పార్టీలు వస్తాయి.. పోతాయి.. కానీ ప్రభుత్వం మాత్రం ప్రజల కోసం, వారి భవిష్యత్తు కోసం పనిచేయాలి అని ఆయన హితవు పలికారు. 20 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాట మాడొద్దన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పేద తల్లిదండ్రుల పిల్లలు కూడా గొప్పగా చదువుకుని డాక్టర్లు, ఇంజనీర్లు, అడ్వకేట్లు, ఉన్నతాధికారులు కావాలి.. అదే నిజమైన తెలంగాణ అభివృద్ధి.. ఫీజుల బకాయిలు చెల్లించే వరకు.. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరు కొనసాగుతుంది అని ఈటల స్పష్టం చేశారు.

## భవిష్యత్ తరానికి బాధ్యతలు
# అప్పగించాల్సి ఉంది

- గడ్కరీ వ్యాఖ్యలతో రాజకీయ కలకలం
- కేంద్రంలో కొత్త తరానికి అవకాశం ?



**న్యూదిల్లీ, ఆగస్టు 25, సిరి న్యూస్:**

కేంద్ర మంత్రిమండలిలో మార్పులు చేర్పులపై కొంతకాలంగా ఊహాగానాలు వినిపిస్తున్న వేళ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు రాజకీయ కాకను రేపుతున్నాయి. యువతరానికి బాధ్యతలు అప్పగించాల్సిన సమయం వచ్చిందని నితిన్ గడ్కరీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ మేరకు మహారాష్ట్ర లోని నాగ్‌పూర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గడ్కరీ తాజా వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. నేను చేయాలనుకున్నంత కాలం పనిచేశాను. ప్రస్తుతం నేను మునుపటిలా పనిచేయలేకపోతున్నా. ప్రజాపనుల్లో ప్రమేయం తగ్గిపోయింది. ఆ పనిని కొత్త తరాలకు అప్పగించాలి. కొత్తవారికి సీనియర్లు మార్గనిర్దేశం చేస్తున్నారు. నేను గత 30 ఏళ్లుగా ప్రజాజీవితంలో ఉన్నాను. ఎన్నో ఒడుదొడుకులు ఎదుర్కొన్నాను. అవార్డులూ అందుకున్నాను అని గడ్కరీ గుర్తుచేసు కున్నారు. అలాగే అభివృద్ధి కార్యక్రమాల గురించి మాట్లాడారు. భవిష్యత్‌లో అభివృద్ధి పనుల సంఖ్య మరింత పెరుగుతుందని చెప్పారు. మహారాష్ట్రలో ప్రతి ఆదివాసీ గ్రామానికి విద్యుత్ సదుపాయాన్ని కల్పించడమే తన లక్ష్యమన్నారు. త్వరలోనే కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనున్నట్లు కేంద్రమంత్రి రామ్‌దాస్ ఆఠవాలే వెల్లడించిన సంగతి తెలిసిందే. భాజపా, మిత్రపక్షమైన ఎన్‌సీపీకి చెందిన కొత్త వారిని మంత్రివర్గంలోకి తీసుకుంటారనే ప్రచారం జరుగుతోంది. సంస్థాగతంగానూ భాజపాలో భారీ మార్పులు జరిగిన సంగతి తెలిసిందే. మరోవైపు.. 20శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ వాడకాన్ని ప్రోత్సహిస్తోన్న నితిన్ గడ్కరీ ఆ విషయంలో విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఈ20 పెట్రోల్‌తో తన కుటుంబం లబ్ది పొందుతోందంటూ పలువురు నెటిజన్లు ఆన్‌లైన్‌లో డీప్‌ఫేక్ వీడియోలు, పోస్టులు పెడుతున్నారని బాంబే హైకోర్టును కూడా ఆశ్రయించారు. తనపై వచ్చిన ఆరోపణలను ఖండించారు. ఈ నేపథ్యంలో ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ వార్తల వేళ గడ్కరీ మాటలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గతంలో పార్టీ, ప్రభుత్వం కోసం విస్తృతంగా పని చేశానని.. ఇప్పుడు తన చురుకైన పాత్రను క్రమంగా తగ్గించాల్సిన అవసరం ఉందన్నారు. యువతకు బాధ్యతలు అప్పగించి, వారు పని చేసే అవకాశాన్ని కల్పించాలన్న అభిప్రాయాన్నీ ఆయన వ్యక్తం చేశారు. ఇకపై తీవ్రమైన పాలనాపరమైన ఒత్తిళ్ల కంటే సామాజిక సంక్షేమం, గిరిజన ప్రాంతాలు, రైతుల శ్రేయస్సుపైనే దృష్టి సారిస్తానంటూ నితిన్ గడ్కరీ సంకేతాలు ఇచ్చారు. మహారాష్ట్రలో ఏ గిరిజన గ్రామమూ విద్యుత్ సౌకర్యానికి దూరంగా ఉండకూడదన్న లక్ష్యాన్నీ గడ్కరీ ప్రస్తావించారు. 'చేసినంత కాలం చేశాను.. ఇప్పుడు కొత్త తరానికి అవకాశం ఇవ్వాలి' అని అన్నారు. గడ్కరీ చేసిన ఈ వ్యాఖ్యలు బీజేపీలో జరుగుతున్న తరాల మార్పుపై మరోసారి చర్చకు దారితీశాయి. ఇటీవల పార్టీ సంస్థాగత స్థాయిలో చోటుచేసుకున్న మార్పుల నేపథ్యంలో కేంద్ర మంత్రి తాజా వ్యాఖ్యలకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది.



## తిరుగుబాటు టీఎంసీ ఎంపీలకు
# సుప్రీం నోటీసులు

- 20 మంది ఎంపీలకు నోటీసులు జారీ
- అనర్హత పిటిషన్లపై కాలపరిమితి ఉండాలన్న కోర్టు
- స్పీకర్‌కు నోటీసులు ఇవ్వడంపై విచారణలో చర్చ
- మమతపై తిరుగుబాటు.. ఎన్‌సీపీఐలో చేరిన ఎంపీలు

**న్యూఢిల్లీ, ఆగస్టు 25, సిరి న్యూస్:**

తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ)కు చెందిన 20 మంది తిరుగుబాటు ఎంపీలకు సుప్రీంకోర్టు మంగళవారం నోటీసులు జారీ చేసింది. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద వారిపై దాఖలైన అనర్హత పిటిషన్లను త్వరగా పరిష్కరించాలని కోరుతూ టీఎంసీ ప్రధాన కార్యదర్శి, లోక్‌సభలో పార్టీ నేత అభిషేక్ బెనర్జీ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై కోర్టు ఈ చర్య తీసుకుంది. ఈ పిటిషన్లు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా వద్ద పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందని అభిషేక్ బెనర్జీ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.

**కాలపరిమితి ఉండాలి**

చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి. మోహన్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. స్పీకర్‌కు కూడా నోటీసులు జారీ చేయాలని ధర్మాసనం భావించినప్పటికీ, ఆయన తరఫున తానే హాజరవుతానని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. అనర్హత పిటిషన్లపై ఇప్పటికే స్పీకర్‌కు నోటీసులు జారీ అయిన విషయాన్ని కోర్టుకు వెల్లడించారు. దీనిపై జస్టిస్ బాగ్చీ స్పందిస్తూ రాజ్యాంగబద్ధమైన అధికారికి ఆదేశాలు జారీ చేయడం తమ ఉద్దేశం కాదని, అయితే అనర్హత వ్యవహారంపై నిర్దిష్ట కాలపరిమితి ఉండాలని స్పష్టం చేశారు.

**తిరుగుబాటు ఎంపీలు వీరే**

సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసిన వారిలో సయాని ఘోష్, కాకోలి ఘోష్ దస్తిదార్, సుదీప్ బంద్యోపాధ్యాయ్, శతాబ్ది రాయ్, ప్రసూన్ బెనర్జీ, అరూప్ చక్రవర్తి, దీపక్ దేవ్ అధికారి, యూసుఫ్ పఠాన్ తదితరులు ఉన్నారు. పశ్చిమ బెంగాల్‌లో టీఎంసీ ఘోర ఓటమి తర్వాత వీరు మమతా బెనర్జీ నాయకత్వంపై తిరుగుబాటు చేసినట్లు సమాచారం. మేలో వీరంతా నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా(ఎన్‌సీపీఐ)లో చేరారు. తమను ప్రత్యేక గ్రూపుగా గుర్తించాలని తిరుగుబాటు ఎంపీలు కోరుతున్నారు.

**అనర్హత వేటుకు టీఎంసీ డిమాండ్**

పార్టీ ఫిరాయింపుల చట్టం కింద 20 మంది తిరుగుబాటు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని టీఎంసీ కోరుతోంది. అనర్హత పిటిషన్లపై స్పీకర్ నిర్ణయం తీసుకోవడంలో జాప్యం జరుగుతోందన్న అభిషేక్ బెనర్జీ వాదనపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టడంతో ఈ వ్యవహారం మరోసారి రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

# కేంద్ర కేబినెట్‌లో భారీ మార్పులు?

**న్యూఢిల్లీ, ఆగస్టు 25, సిరి న్యూస్:**



కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణకు రంగం సిద్ధమవుతున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. వచ్చే ఏడాది ప్రారంభంలో ఉత్తరప్రదేశ్, గుజరాత్, గోవా, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, మణిపూర్, పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో కేబినెట్‌లో మార్పులు చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దేశంలో జెన్‌జీ ఉద్యమం కొనసాగుతున్న సమయంలో యువతకు ప్రాధాన్యం ఇచ్చేలా మంత్రివర్గంలో కొత్త ముఖాలను తీసుకురావచ్చన్న ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి.

**12 మంత్రి పదవులు ఖాళీ**

ఇటీవల ముగ్గురు మంత్రులు రాజీనామా చేయడంతో ప్రస్తుతం కేంద్ర మంత్రివర్గంలో 29 మంది కేబినెట్ మంత్రులు, స్వతంత్ర బాధ్యతలు కలిగిన ఐదుగురు సహాయ మంత్రులు, 34 మంది సహాయ మంత్రులు ఉన్నారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 75(1A) ప్రకారం కేంద్ర మంత్రివర్గంలో గరిష్ఠంగా 81 మంది సభ్యులు ఉండవచ్చు. దీంతో ప్రస్తుతం 12 మంత్రి పదవులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీల భర్తీతో పాటు పనితీరు ఆధారంగా కొందరు మంత్రుల శాఖలను మార్చడం లేదా వారిని తప్పించడం జరిగే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**ఎన్నికల రాష్ట్రాలకు ప్రాధాన్యం**

బీజేపీ అధ్యక్షుడు నితిన్ నవీన్ కొత్త బృందాన్ని ఏర్పాటు చేసిన నేపథ్యంలో మోదీ కూడా కేబినెట్‌లో మార్పులకు శ్రీకారం చుట్టవచ్చన్న ప్రచారం ఊపందుకుంది. ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న హర్ష్ మల్హోత్రా, ఉత్తరప్రదేశ్ బీజేపీ అధ్యక్షుడిగా ఉన్న పంకజ్ చౌదరిలను సహాయ మంత్రులుగా నియమించడం కూడా ఈ కసరత్తులో భాగమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వచ్చే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఉత్తరప్రదేశ్, గుజరాత్, మధ్యప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన కొత్త ముఖాలకు అవకాశం కల్పించవచ్చని తెలుస్తోంది. 2029 లోక్‌సభ ఎన్నికలను కూడా పునర్వ్యవస్థీకరణలో పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది.

**మిత్రపక్షాలకు చోటు?**

కేబినెట్ విస్తరణలో కొత్త మిత్రపక్షాలకు ప్రాతినిధ్యం కల్పించే అంశం కూడా చర్చకు వస్తోంది. డీఎంకే, ఎన్‌సీపీఎస్పీ, అకాలీదళ్ భవిష్యత్తులో ఎన్‌డీఏలో చేరే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. పంజాబ్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని బీజేపీలో చేరిన ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన రాజ్యసభ సభ్యుల్లో ఒకరికి అవకాశం కల్పించవచ్చన్న ప్రచారం ఉంది. శివసేన నుంచి శ్రీకాంత్ షిండే పేరు కూడా వినిపిస్తోంది.

**యువత, మహిళలకు ప్రాధాన్యం**

మంత్రివర్గంలో ప్రస్తుతం 70 ఏళ్లు దాటిన మంత్రులు 12 మంది ఉన్నారు. 81 ఏళ్ల జితన్‌రామ్ మాంఝీ అత్యంత వయసున్న మంత్రి కాగా, 38 ఏళ్ల రామ్మోహన్ నాయుడు అత్యంత పిన్న వయస్కుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో యువతకు, మహిళలకు మరింత ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. ప్రస్తుతం 14 మంది మంత్రులు ఒకటి కంటే ఎక్కువ శాఖల బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కొత్త మంత్రుల చేరికతో వారి అదనపు బాధ్యతలను తగ్గించే అవకాశం కూడా ఉందని తెలుస్తోంది.

# ఇక పైలెట్లకూ డోపింగ్ టెస్ట్‌లు

- మాదక ద్రవ్యాలు వినియోగంచకుండా ఆంక్షలు
- టెస్ట్ వ్యవహారాలను పరిశీలిస్తున్న డిజిసి
- కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



**న్యూదిల్లీ, ఆగస్టు 25, సిరి న్యూస్ :**

ఇకపై ఏడాదికి ఒక్కసారైనా విమాన పైలట్లకు డోప్ టెస్టులునిర్వహించాలనే ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. పైలట్లు మాదకద్రవ్యాల, మత్తు పదార్థాలు ఉపయోగించకుండా అరికట్టేందుకు, భవిష్యత్తులో కఠినమైన నిబంధనలు తెచ్చేందుకు డీజీసీఏ ప్రస్తుతం విమానయాన సంస్థలతో చర్చలు జరుపుతోందని చెప్పు కొచ్చారు. ప్రస్తుతం మొత్తం పైలట్ల సంఖ్యలో 10 శాతం మందికి మాత్రమే డోప్ టెస్టులు నిర్వహించాలనే నిబంధన అమల్లో ఉందని చెప్పారు. ఏడాదిలో ఒకసారి ప్రతి పైలట్‌కూ పరీక్ష నిర్వహించేలా దీనిని మార్పు చేయాలనే అంశాన్ని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ పరిశీలిస్తోందన్నారు. భద్రత, నిర్వహణ పరమైన అంశాలను పరిగణనలోకి తీసుకొని దీనిపై ఓ నిర్ణయం తీసుకుంటామన్నారు. మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన ప్రస్తుత నిబంధనలను మరింత కఠినం చేసే మార్గాలపైనా డీజీసీఏ అధ్యయనం చేస్తోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇటీవల జరిగిన ఎయిర్ ఇండియా పుకెట్‌దిల్లీ విమాన ఘటనపై మాట్లాడుతూ.. దీనిపై ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు చేస్తోందన్నారు. విమానంలోని పైలెట్ డేటా రికార్డర్ దర్యాప్తు సంస్థ ఆధీనంలో ఉందని పేర్కొన్నారు. త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. థాయ్‌లాండ్ నుంచి దిల్లీకి వస్తున్న విమానం ఆగస్టు 4న తీవ్ర కుదుపులకు లోనైన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో 17 మంది గాయపడ్డారు. ఈ ఘటన అనంతరం పైలట్లు ఇద్దరికీ డ్రగ్ టెస్ట్ నిర్వహించారు. తొలి పరీక్షలో పైలట్ ఇన్ కమాండ్‌కు పాజిటివ్ వచ్చింది. దీని తర్వాత సైకోయాక్టివ్ పరీక్ష నిర్వహించగా.. గంజాయి సేవించినట్లు నిర్ధరణ అయ్యింది. ఈ ఘటనపై ఎయిర్ క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు జరుపుతోందని పేర్కొన్నారు. విమానం డేటా రికార్డర్లు, ఇతర భాగాలు సురక్షితంగా ఉన్నందున, త్వరలోనే ప్రాథమిక నివేదిక వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం పైలట్ నెట్‌వర్క్‌లో కేవలం పదిశాతం మందికి మాత్రమే రాండమ్‌గా డోప్ టెస్టులు నిర్వహిస్తున్నారని రామ్మోహన్ వెల్లడించారు. ప్రతీ పైలట్‌కు సంవత్సరంలో కనీసం ఒక్కసారైనా రాండమ్‌గా పరీక్ష నిర్వహించాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తోందని అన్నారు. విమాన ప్రయాణికుల భద్రత అత్యంత ముఖ్యమైనదని చెప్పారు. విమాన సంస్థల ఆపరేషనల్ ప్రభావం కూడా దెబ్బతినకుండా ఈ రెండింటి మధ్య సమతుల్యత పాటిస్తామని రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.

# పాకిస్తాన్ వేడుకున్నా దాడి చేశాం

- ఆపరేషన్ సిందూర్‌లో చివరి దాడి మన నుంచే
- చర్చలకు పాక్ ఫోన్ చేసినా పట్టించుకోలేదు
- సర్గోధాపై దాడికి అనిల్ చౌహాన్ అనుమతి

**న్యూఢిల్లీ, ఆగస్టు 25, సిరి న్యూస్:**

ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్ చర్చలకు సిద్ధమంటూ భారత్‌ను సంప్రదించినా, దాడులను కొనసాగించామని మాజీ సీడీఎస్ జనరల్ అనిల్ చౌహాన్ వెల్లడించారు. వివేకానంద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఆపరేషన్ సిందూర్ వ్యూహాత్మక అంశాలను వివరించారు. పాకిస్తాన్ ఉదయం సుమారు 10 గంటలకు చర్చల కోసం ఫోన్ చేసిన సమయంలోనే సర్గోధాపై దాడి చేయాలా అని భారత వైమానిక దళం తనను అడిగిందని, తాను "గో ఎహెడ్" అంటూ అనుమతి ఇచ్చినట్లు తెలిపారు.

**దాడులపై స్పష్టమైన వ్యూహం**

ఆపరేషన్ సిందూర్ కోసం భారత్ రూపొందించిన ఎస్కలేషన్ మ్యాట్రిక్స్‌లో తుది దాడి ఎప్పుడూ భారత్ నుంచే జరగాలన్నది కీలక సూత్రమని చౌహాన్ చెప్పారు. పాకిస్తాన్ ప్రతీకార దాడులకు పాల్పడితే, వాటికి అనుగుణంగా తదుపరి దశలకు వెళ్లేందుకు భారత సైన్యం ముందుగానే వ్యూహాలను సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు.

**స్కార్దుకు బదులు మరో లక్ష్యం**

సర్గోధాతో పాటు మరో రెండు లక్ష్యాలను గుర్తించాలని తాను సూచించినట్లు చౌహాన్ వెల్లడించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని స్కార్దుపై దాడికి అనుమతి ఇచ్చినా, వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ఆ లక్ష్యాన్ని భోలారికి మార్చాల్సి వచ్చిందన్నారు.

**తక్కువ ఎత్తులో గగనతల వినియోగం**

ఆపరేషన్ సిందూర్‌లో తక్కువ ఎత్తులోని గగనతలాన్ని వినియోగించడం ప్రత్యేక వ్యూహమని చౌహాన్ తెలిపారు. ఉరీ ఉగ్రదాడి తర్వాత భూతల దాడి, పుల్వామా ఘటన తర్వాత పెద్ద స్థాయి వైమానిక దాడులు జరిగాయని గుర్తుచేశారు. సిందూర్‌లో మూడో మార్గంగా తక్కువ ఎత్తులోని గగనతలాన్ని వినియోగించామని చెప్పారు. దీనివల్ల సంఘర్షణ తీవ్రతను నియంత్రిస్తూ విజయావకాశాలను పెంచడంతో పాటు ప్రత్యర్థికి అనూహ్య షాక్ ఇవ్వగలిగామని వివరించారు.

**మూడు దళాల సమన్వయం**

ఆపరేషన్ విజయానికి మెరుగైన పరిస్థితుల అవగాహన, యుద్ధభూమిపై స్పష్టమైన సమాచారం, మూడు దళాల మధ్య సమర్థవంతమైన సమాచార నెట్‌వర్కింగ్ కీలకంగా నిలిచాయని చౌహాన్ చెప్పారు. ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌కు ఒకే విధమైన సమగ్ర ఆపరేషన్ చిత్రం అందుబాటులో ఉండటంతో వేగంగా, మెరుగ్గా నిర్ణయాలు తీసుకోగలిగామని తెలిపారు. రాజకీయ నాయకత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు రావడం వల్ల సైన్యానికి ఆపరేషన్‌ను ప్రణాళికాబద్ధంగా అమలు చేసే పూర్తి స్వేచ్ఛ లభించిందని పేర్కొన్నారు.

# తెలంగాణ మోడల్‌లో కులగణన

- జనగణనలో కులగణన విధానం సరిగా లేదు
- ప్రశ్నావళి మార్చేందుకు అఖిలపక్షం ఏర్పాటు
- ప్రధాని మోదీకీ రాహుల్, ఖర్గేల లేఖ

**న్యూఢిల్లీ, ఆగస్టు 25, సిరి న్యూస్:**

జనగణన పద్ధతిపై కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీకి మంగళవారం ఖర్గే, రాహుల్ సుదీర్ఘ లేఖ రాశారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. కులగణలో తెలంగాణ మోడల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. జనగణనలో కులాల నమోదుకు 'ఓపెన్‌ఎండెడ్' విధానాన్ని అమలు చేయడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కులాల లెక్కింపు విధానాలతో తీవ్ర నష్టం జరుగుతోందని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. 'ఒకే కులం వేర్వేరు పేర్లతో విడిపోయి లక్షలాది కులాల పేర్లుగా నమోదవుతాయని.. దీనివల్ల లెక్కింపు డేటా పూర్తిగా నిరుపయోగంగా మారుతుందని తెలిపారు. ప్రశ్నావళిలో 'వెనుకబడిన వర్గాలు' అనే పదమే లేకపోవడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ తరహాలోనే బీసీ, ఓబీసీ కులాల నమోదుకూ 'డ్రాప్‌డౌన్ జాబితా' విధానాన్ని ఉపయోగించాలని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే సూచించారు. తెలంగాణ (2024), బిహార్ (2022) సర్వేల్లో వాడిన కులాల జాబితా నమూనాలను ప్రధానికి పంపించారు. ప్రస్తుత గందరగోళ ప్రశ్నావళిని వెంటనే రద్దు చేసి, అన్ని పార్టీలు - నిపుణులతో చర్చించి ఓ కొత్త ప్రశ్నావళిని రూపొందిం చాలని ఖర్గే, రాహుల్ డిమాండ్ చేశారు. ఇదిలావుంటే రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను అంతం చేయడానికి మోదీ ప్రభుత్వం కుట్రపన్నిందని, దీనిలో భాగంగానే కేంద్రానికి చెందిన వివిధ శాఖాల్లో ఖాలీగా ఉన్న 8.2లక్షలకు పైగా ఉద్యోగాలను భర్తీ చేయడం లేదని కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. మంత్రిత్వ శాఖల వారీగా ఖాలీగా ఉన్న పోస్టులపై డియా నివేదికను ఉటంకిస్తూ విమర్శలు సంధించారు. '2015లో కేంద్ర ప్రభుత్వ శాఖల్లో 4.21లక్షల ఉద్యోగాలు భర్తీకాకుండా ఉన్నాయి. 2024కు వాటి సంఖ్య 8.24 లక్షలకు చేరాయి. రైల్వేల్లో 2.40లక్షలు, కేంద్ర హోంశాఖ పరిధిలో 1.10 లక్షలు ఉద్యోగాలు భర్తీ చేయాల్సి ఉంది. ప్రభుత్వ రంగ సంస్థల్లోని 5.1 లక్షల శాశ్వత ఉద్యోగాలను రద్దు చేశారు.



ఇవికాక రక్షణ రంగంలో 2.41 లక్షల పోస్టులు ఖాలీగా ఉన్నాయని ఖర్గే తెలిపారు. ఒప్పంద ఉద్యోగులు 19శాతం నుంచి 49శాతానికి పెరిగారని వెల్లడించారు. ఇది ఒక్క ఉపాధి సమస్య మాత్రమే కాదు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన సామాజిక న్యాయం అంశం కూడా ఇమిడి ఉందని పేర్కొన్నారు. విద్య, ఉపాధి రంగాల్లో యువ భారతీయుల జీవితాలను మోదీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. దేశంలో 15 నుంచి 29 ఏళ్ల వయసు గల 8.7 కోట్ల మంది యువత చదువులు, ఉపాధికి దూరమయ్యారని, వారికి ఎటువంటి నైపుణ్య శిక్షణలూ అందడం లేదన్నారు. నీతిఆయోగ్ నివేదికను ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. దేశంలో గత 40 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా నిరుద్యోగుల శాతం పెరిగిందని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత ప్రియాంకా గాంధీ విమర్శించారు.

## రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని మగ వ్యక్తి మృతి.

**కొంపల్లి.ఆగష్టు.25(సిరి న్యూస్).**



రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మగ వ్యక్తి మృతి చెందిన ఘటన పేట్–బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చోటు చేసుకుంది.స్థానిక పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...24వ తేదీన తెల్లవారుజామున సుమారు 04:00 గంటల సమయంలో కొంపల్లి సినీ ప్లానెట్ ఎదురుగా సుచిత్ర రోడ్డుపై ఒక గుర్తుతెలియని పురుషుడు రోడ్డు ప్రమాదానికి గురై గాయాలతో పడి ఉన్నట్లు డయల్–100 ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే 108 అంబులెన్స్ సిబ్బంది అతనికి చికిత్స అందిస్తున్నారు.అనంతరం అతనిని గాంధీ ఆసుపత్రికి తరలించగా అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు.మృతుడి వివరాలు: పురుషుడు వయస్సు సుమారు 50–55 సంవత్సరాలు పేరు మరియు ఇతర వివరాలు తెలియరాలేదు. కావున మృతుడిని గుర్తించగలిగిన వారు లేదా ప్రమాదానికి సంబంధించిన సమాచారం తెలిసిన వారు పేట్ బషీరాబాద్ పోలీస్ వారికీ సమాచారం అందించాలని తెలిపారు.సంప్రదించండి: 8712568203,8712510774

## అధైర్యపడకండి..అండగా ఉంటాను

### పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**పటాన్ చెరు, ఆగస్టు 25, (సిరి న్యూస్):**

పటాన్ చెరు జెపి కాలనీ డివిజన్ పరిధి లోని బండల గూడ రైల్వే భూముల అంశంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, స్థానిక ప్రజా ప్రతినిధిగా అండగా ఉంటానని పటాన్ చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి నిర్వాసితులకు భరోసా అందించారు. సోమవారం సాయంత్రం మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ నేతృత్వంలోని నిర్వాసితుల బృందం ఎమ్మెల్యే జిఎంఆర్ ను కలిసి న్యాయం చేయాలంటూ వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ గత 50 సంవత్సరాల నుండి బండల గూడలో గుడిసెలు వేసుకుని నివాసముంటున్న నిరుపేద ప్రజల నివాసాలను రైల్వే భూముల పేరుతో సంబంధిత అధికారులు ఖాళీ చేయాలంటూ నోటీసులు జారీ చేయడం తగదని అన్నారు. ఈ అంశం పై సంబంధిత రైల్వే అధికారులతో చర్చించడం తో పాటు, అవసరమైన పక్షంలో భారీ నిరసన కార్యక్రమాన్ని చేపడతామని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల్లో ఊరి పేరు తప్పుగా ముద్రణ

### వరిగుంతం కార్డుల్లో కొల్చారం పేరు..
### సరిచేస్తామన్న తహసీల్దార్ శ్రీనివాస చారి

**కొల్చారం, ఆగస్టు 25 (సిరి న్యూస్)**




ప్రభుత్వం పేదలకు ఆహార భద్రత కల్పించేందుకు పంపిణీ చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డుల్లో గ్రామం పేరు తప్పుగా ముద్రితమైంది. కొల్చారం మండలంలోని వరిగుంతం గ్రామానికి సంబంధించిన రేషన్ కార్డుల్లో వరిగుంతం పేరుకు బదులుగా కొల్చారం గ్రామం పేరు ముద్రితమైంది.

వరిగుంతం గ్రామంలోని 13వ రేషన్ షాప్ డీలర్ పరిధిలో మొత్తం 480 రేషన్ కార్డులు ఉన్నాయి. మంగళవారం గ్రామపంచాయతీ ఆవరణలో జీపీఓ సమక్షంలో లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. అయితే కార్డులను పరిశీలించగా వరిగుంతం గ్రామానికి చెందిన కార్డుల్లో గ్రామం పేరు కొల్చారం అని ముద్రించి ఉండటం వెలుగులోకి వచ్చింది. దీంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు.

## పుల్ల నర్సమ్మ కుటుంబానికి ఆర్థిక సహాయం!!

### పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి !!

**శివంపేట ఆగష్టు 25 ( సిరి న్యూస్ )**



శివంపేట మండల కేంద్రంలోని కొంతాన్ పల్లి గ్రామానికి చెందిన కుల్ల నర్సమ్మ మరణించడం జరిగింది ఈ విషయం గ్రామస్తుల ద్వారా తెలుసుకున్న శివంపేట్ మండల పిఎసిఎస్ చైర్మన్ చింతల వెంకట్రాంరెడ్డి వారి కుటుంబాని పరమర్శించి, మనోధైర్యం తెలిపి నేనున్నాను అని భరోసా కల్పించి తన సొంత నిధుల నుండి 5000 వేల రూపాయలు గ్రామ సర్పంచ్ చింతల విజయ వెంకట్రాంరెడ్డి చేతుల మీదుగా వారి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గుండు వేణు గోపాల్, గుండు అంజమ్మ వెంకటేష్, కుల్ల వెంకటేష్, కుల్ల సత్యం, జంగం భూమలింగ, కుల్ల నాగరాజు, కలకంటి నాగరాజు, బ్యాగరి యాదగిరి, గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్బీఐ కేంద్ర బోర్డులో అనధికార డైరెక్టర్ గా సయ్యద్ అక్బరుద్దీన్ నియామకం

- హర్షం వెలిబుచ్చిన గీతం యాజమాన్యం,
- సంతోషాన్ని వ్యక్తపరిచిన కౌటిల్యా అధ్యాపకులు

**పటాన్ చెరు, ఆగస్టు 25,(సిరి న్యూస్)**

హైదరాబాదు లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డీన్, ఐక్యరాజ్య సమితిలో భారత మాజీ రాయబారి సయ్యద్ అక్బరుద్దీన్ రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) కేంద్ర బోర్డులో పార్ట్–టైమ్, అనధికారిక డైరెక్టర్ గా నియమితులయ్యారు. నాలుగేళ్ల కాల పరిమతి గల ఈ నియామక ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయి.. భారత ప్రభుత్వానికి క్యాబినెట్ నియామకాల కమిటీ సచివాలయం, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ, సిబ్బంది–శిక్షణ విభాగం అండర్ సెక్రటరీ (ఈవో–ఎస్ఎం–II) కుందన్ నాథ్ ఈ నియామకానికి సంబంధించిన ఉత్తర్వులను వెలువరించారు. సయ్యద్ అక్బరుద్దీన్ తో పాటు,



యానీ జార్జ్ మాథ్యూ, జనమేజయ కుమార్ సిన్హా కూడా ఆర్బీఐ కేంద్ర బోర్డులో పార్ట్–టైమ్ అనధికారిక డైరెక్టర్లుగా నియమితులయ్యారు. దౌత్యవేత్త అక్బరుద్దీన్ నియామకం పట్ల గీతం నాయకత్వం, కౌటిల్యా అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఈ కొత్త బాధ్యతలపై ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

**సయ్యద్ అక్బరుద్దీన్ గురించి:**

సయ్యద్ అక్బరుద్దీన్ మూడు దశాబ్దాలకు పైగా వృత్తి జీవితాన్ని గడిపిన, 1985 బ్యాచ్ ఇండియన్ ఫారిన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్)కు చెందిన ఒక విశిష్ట భారతీయ దౌత్యవేత్త. ఆయన, జనవరి 2016 నుంచి ఏప్రిల్ 2020 వరకు న్యూయార్క్ లోని ఐక్యరాజ్య సమితిలో భారతదేశ శాశ్వత ప్రతినిధిగా పనిచేశారు. అంతకు ముందు, జనవరి 2012 నుంచి ఏప్రిల్ 2015 వరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధిగా వ్యవహరించారు. అలాగే, 2006 నుంచి 2011 వరకు వియన్నాలోని అంతర్జాతీయ అణుశక్తి సంస్థ (ఐఏఈఏ)లో విదేశీ సంబంధాలు, విధాన సమన్వయ విభాగాధిపతి గా పనిచేశారు. తన దౌత్య వృత్తి జీవితంలో, అక్బరుద్దీన్ స్వదేశంలోనూ, విదేశాలలోనూ అనేక కీలక బాధ్యతలు నిర్వహించారు. కైరో, రియాద్, జెద్దా నగరాలలో పనిచేయడం ద్వారా పశ్చిమ ఆసియా వ్యవహారాలపై ఆయన గణనీయమైన నైపుణ్యాన్ని సంపాదించారు. విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి కార్యాలయంలో డైరెక్టర్ గా పనిచేయడంతో పాటు, విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖలో బాహ్య ప్రచారం, ప్రజా దౌత్య విభాగానికి నాయకత్వం వహించడం వంటి ఉన్నత బాధ్యతలను కూడా ఆయన చేపట్టారు. 2015లో జరిగిన భారత్–ఆఫ్రికా శిఖరాగ్ర సమావేశానికి ఆయన ముఖ్య సమన్వయకర్తగా వ్యవహరించారు. ఐక్యరాజ్య సమితి (యూఎన్)లో భారతదేశ శాశ్వత ప్రతినిధిగా, అక్బరుద్దీన్ బహుపాక్షిక వేదికలపై భారతదేశ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రముఖ పాత్ర పోషించారు. ఆయన సమర్థవంతమైన దౌత్యపరమైన కృషికి విస్తృతంగా గుర్తింపు పొందారు. ఆయన పదవీ కాలంలో ఉగ్రవాద నిరోధం, వాతావరణ మార్పు, సుస్థిర అభివృద్ధి, అంతర్జాతీయ శాంతి భద్రతలు వంటి అంశాలకు గణనీయమైన తోడ్పాటు అందించారు. గీతంలోని కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డీన్ గా, అక్బరుద్దీన్ ప్రజా విధాన విద్యకు, భారత దేశంలో, వెలుపల భవిష్యత్తు నాయకులను తీర్చిదిద్దడంలో తనవంతు కృషిని కొనసాగిస్తున్నారు.

## కృష్ణాష్టమి కోసం ముస్తాబవుతున్న శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయం







**పటాన్ చెరు, ఆగస్టు 25, (సిరి న్యూస్):**

రానున్న శ్రీ కృష్ణాష్టమి ఉత్సవాల సందర్భంగా శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయ ధర్మకర్త పటాన్ చెరు తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జెపి కాలనీ లోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి వారి ఆలయం సర్వాంగ సుందరంగా ముస్తాబు చేయడం జరుగుతుంది. ఆలయానికి కొత్త గా రంగులు వేస్తూ చిన్న చిన్న మరమ్మతులు ఉంటే పూర్తి చేస్తున్నారు. ఈ సందర్భంగా మెట్టు కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఈ యేడు కూడా శ్రీ కృష్ణాష్టమి ఉత్సవాలను అంగ రంగ వైభవంగా నిర్వహించనున్నామని చెప్పారు. అందు కొరకు ఆలయ ప్రకారాలకు రంగులతో పాటు విద్యుత్ దీపాలతో ఆలయాన్ని దేదీప్యమానంగా తీర్చిదిద్దుతున్నట్లు తెలిపారు. ఉత్సవాలలో పాల్గొనే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు, లోటు పాట్లు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మెట్టు కుమార్ యాదవ్ తెలిపారు. ఈ కార్య క్రమంలో పలువురు నాయకులు, కార్య కర్తలు కూడా పాల్గొన్నారు.





## భారతి నగర్ లో అభివృద్ధి పనులపై సింధు ఆదర్శ్ రెడ్డి దృష్టి

### పనులు వేగంగా పూర్తిచేయాలని అధికారులకు సూచన

**రామచంద్రపురం, ఆగస్టు 25 (సిరి న్యూస్) :**

భారతి నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి తన హయాంలో మంజూరైన అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులు నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తయ్యేలా సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎల్ ఐజీ కాలనీలో జరుగుతున్న షెడ్ నిర్మాణ పనులను పరిశీలించి, పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు.



పెండింగ్ పనులను వినాయక చవితి పండుగలోపు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ విభాగం ఏఈ శివకు సూచించారు. అనంతరం ఎంఐజీ కాలనీలోని సిటిజన్ భవన్ సమీప ప్రాంతాన్ని పరిశీలించారు. స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ప్రాంతాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా డివిజన్ లో మౌలిక వసతుల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని సింధు ఆదర్శ్ రెడ్డి తెలిపారు.

## క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్తు....

### ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి.....

**రామాయంపేట, మెదక్ ఆగష్టు 25 (సిరి న్యూస్)**

విద్యార్థులు క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ హిమ జ్యోతి చెప్పారు మంగళవారం కళాశాలలో ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఈ మాట్లాడుతూ జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులను ఆదర్శంగా తీసుకొని ముందుకు పోవాలని తెలిపారు. కళాశాలలో అనుభవం గల అధ్యాపకులతో విద్యాబోధన అందించడం జరుగుతుందన్నారు. ప్రతి విద్యార్థి క్రమశిక్షణ పట్టుదలతో చదివి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని ఆమె సూచించారు. ప్రతి విద్యార్థి పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని




చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మెరుగైన వసతులతో పాటు మంచి విద్యాబోధన అందించడం జరుగుతుందని తెలిపారు . గత ఏడాది కళాశాలలో ఉత్తమ



మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ నగదు తో పాటు బహుమతులను అందజేశారు. అలాంటి విద్యార్థులను జూనియర్ విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. అనంతరం కళాశాలకు చెందిన పలువురు అధ్యాపకులు మాట్లాడుతూ విద్యార్థులకు పలు సలహాలు సూచనలు అందజేశారు. పట్టుదలతో చదివితే ఏదైనా సాధించవచ్చని వారు తెలిపారు. అనంతరం విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ మల్లేశం అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నల్లాల బావి స్థలానికి రక్షణ చర్యలు

- బోర్డు ఏర్పాటు చేసిన మున్సిపల్ అధికారులు
- స్వాగతించిన బిజెపి కౌన్సిలర్ జాలిగామ శంకర్ గౌడ్.




**రామాయంపేట, ఆగస్టు 25 (సిరి న్యూస్)**

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని హీరో షోరూమ్ వద్ద ఉన్న మున్సిపల్ స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్న సమాచారంతో అధికారులు స్పందించారు. సుమారు 160 గజాల విస్తీర్ణంలో ఉన్న ఈ స్థలం విలువ సుమారు రూ.65 లక్షల వరకు ఉంటుందని స్థానికులు పేర్కొంటున్నారు. గత నెలలో ఈ ప్రాంతంలో ఉన్న మంచినీటి బావి స్థలాన్ని మట్టితో నింపి చదును చేసినట్లు, కొందరు ప్రైవేటు వ్యక్తులు, నాయకులు ఆ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్న ఆరోపణలు వచ్చాయి. దీంతో మున్సిపల్ ఆస్తిని పరిరక్షించడంతో పాటు స్థలానికి కొలతలు నిర్వహించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆర్. రవీందర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై స్పందించిన మున్సిపల్ అధికారులు స్థలాన్ని పరిశీలించి, అది మున్సిపాలిటీకి చెందిన ఆస్తిగా గుర్తించారు. అనంతరం మున్సిపల్ స్థలాన్ని పరిరక్షించే చర్యల్లో భాగంగా అక్కడ "ఈ స్థలం రామాయంపేట మున్సిపాలిటీకి చెందినది" అంటూ బోర్డును ఏర్పాటు చేశారు. మున్సిపల్ ఆస్తులకు రక్షణ కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. స్థలానికి పూర్తి స్థాయిలో కొలతలు నిర్వహించి హద్దులు నిర్ధారించడంతో పాటు భవిష్యత్తులో ఆక్రమణలకు అవకాశం లేకుండా ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన మున్సిపల్ స్థలాలను కాపాడేందుకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించిన తీరును బిజెపి కౌన్సిలర్ శంకర్ గౌడ్ స్వాగతించారు.

# శ్రమిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చు

- నీలం మధు ముదిరాజ్
- సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్ పరీక్షలో అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగానికి ఎంపికైన *భాస్కర్ కు సన్మానం
- గతంలో తన కోచింగ్ కు సాయం చేసిన నీలం మధుకు ధన్యవాదాలు తెలిపిన భాస్కర్





**పటాన్ చెరు, ఆగస్టు 25, (సిరి న్యూస్):**

విద్యార్థులు కష్టపడి చదువుకుని శ్రమిస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ పిలుపు నిచ్చారు. మంగళ వారం నాడు నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేర్ మండలం, పోమ్యా నాయక్ తండాకు చెందిన ధారావత్ భాస్కర్ యుపిఎస్సి నిర్వహించిన 'సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్సెస్' పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, అసిస్టెంట్ కమాండెంట్ ఫలితాల్లో దేశంలోనే 58వ ర్యాంక్, ఎస్ టీ కేటగిరీ విభాగంలో ఆల్ ఇండియా 1వ ర్యాంక్ సాధించారు. గతంలో భాస్కర్ కోచింగ్ నిమిత్తం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పుడు నీలం మధు ముదిరాజ్ అతనికి సహాయం అందించడమే కాకుండా, శిక్షణ సమయంలోనూ నిరంతరం ప్రోత్సహించి చేయూతనందించారు. ఉన్నత ఉద్యోగానికి ఎంపికైన అనంతరం ధారావత్ భాస్కర్ మంగళ వారం నాడు మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జి నీలం మధు ముదిరాజ్ ను తన కార్యాలయంలో కలిసి తనకు అందించిన సహాయ సహకారాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపి సత్కరించారు . ఈ సందర్భంగా భాస్కర్ పట్టుదల, కష్టపడే తత్వాన్ని నీలం మధు అభినందిస్తూ అతడిని శాలువాతో సన్మానించారు. అనంతరం నీలం మధు ముదిరాజ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతానికి చెందిన యువకుడు పట్టుదలతో చదివి కేంద్ర ప్రభుత్వంలో అసిస్టెంట్ కమాండెంట్ లాంటి ఉన్నత స్థాయి ఉద్యోగం సాధించడం ఎంతో గర్వకారణమని, నేటి యువతకు భాస్కర్ ఆదర్శమని కొనియాడారు. భవిష్యత్తులో భాస్కర్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి సేవ చేయాలని ఆకాంక్షించారు.

# మొక్కలు నాటి పచ్చని భవిష్యత్తుకు బాటలు వేద్దాం





- పచ్చదనం పెంపుతోనే పర్యావరణ సమతుల్యత..
- భావితరాలకు స్వచ్ఛమైన గాలి
- మొక్కలు నాటడమే కాదు సంరక్షణ కూడా ముఖ్యం
- రామాయంపేట ఫారెస్ట్ రేంజర్ విద్యాసాగర్

**రామాయంపేట, ఆగష్టు 25 (సిరి న్యూస్)**

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందని రామాయంపేట ఫారెస్ట్ రేంజర్ విద్యాసాగర్ అన్నారు. పచ్చదనాన్ని విస్తరించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడటంతోపాటు భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. వన మహోత్సవం సందర్భంగా మంగళవారం మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని స్వామి వివేకానంద విద్యాలయంలో విద్యార్థినీ, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ రేంజర్ విద్యాసాగర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మొక్కలు, అడవులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతోపాటు వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

**మొక్కలు నాటడమే కాదు..**

**సంరక్షణ కూడా ముఖ్యం**

వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా ప్రకృతిని పరిరక్షించే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని విద్యాసాగర్ సూచించారు. నాటిన ప్రతి మొక్కను క్రమం తప్పకుండా సంరక్షించి, అది వృక్షంగా ఎదిగే వరకు బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పచ్చదనం పెరిగితే వాతావరణ సమతుల్యత మెరుగు పడటంతోపాటు ఆరోగ్యకరమైన జీవనానికి అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. భావితరాలకు ప్రకృతి సంపదను అందించాలంటే ప్రస్తుతం ప్రతి ఒక్కరూ మొక్కల పెంపకానికి ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. "మొక్క నాటడం ఒక మంచి ఆరంభం.. దాన్ని వృక్షంగా పెంచడం మన బాధ్యత. ప్రతి ఒక్కరూ మొక్కను నాటి సంరక్షించినప్పుడే వన మహోత్సవం అసలు లక్ష్యం నెరవేరుతుంది" అని ఫారెస్ట్ రేంజర్ విద్యాసాగర్ పేర్కొన్నారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకుని, తమ ఇళ్ల పరిసరాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని మున్సిపల్ పాలకమండలి సభ్యుడు గజవాడ నాగరాజు గుప్తా సూచించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొక్కల ప్రాముఖ్యత గురించి అవగాహన కల్పించడం జరిగింది.ఇట్టి కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్ లు గజవాడ నాగరాజు గుప్త, దేవుని రంజిత్, పుట్టి సందీప్, గూగుల్లోత్తు రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాకి స్వామి, చింతల స్వామి మున్సిపల్ కమిషనర్ రవీందర్, రామాయంపేట సబ్ ఇన్స్పెక్టర్ నరేష్, అటవీ శాఖ డిఆర్ఓ లు గీత, శ్రీనివాస్, జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ కోశాధికారి డి.జి. శ్రీనివాస్ శర్మ, బీట్ ఆఫీసర్ లు లక్ష్మణ్, మహేష్ గౌడ్, ఆవాస ప్రముఖులు ఆచార్య శ్రీనివాస్, పండరీనాథ్ పాల్గొనడం జరిగింది..

# వైభవంగా జగదాంబ భవాని మందిర భూమి పూజ పాల్గొన్న కాటసుధరాణి



**అమీన్పూర్ ఆగస్టు 25 సిరి న్యూస్**

అమీన్పూర్ జిహెచ్ఎంసి సర్కిల్ పరిధిలో సంతు శ్రీ సేవాలాల్ మహారాజ్ జగదాంబ భవాని అమ్మవార్ల ఆశీస్సులతో ఆలయ నిర్మాణానికి ఘనంగా భూమి పూజ నిర్వాహన, వేద పండితుల మంత్రోచ్చారణలు,శాస్త్రోక్తంగా సాగిన ప్రత్యేక పూజలు హోమాలు, సాంప్రదాయ బంజారా సంస్కృతి నృత్యాలు మరియు జై సేవాలాల్ జయ జయ సేవాలాల్ నామస్మరణతో మిన్నంటిన ఉత్సవ వాతావరణం, ముఖ్య అతిథిగా జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధారాణి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

# మొక్కలను నాటి పరిరక్షించాల్సిన బాధ్యత మనదే



- సర్పంచ్ శ్రీనివాస్
- అనంతారం గ్రామంలో ఘనంగా వన మహోత్సవం

**గుమ్మడిదల, ఆగస్టు 25 (సిరి న్యూస్ ):**

గుమ్మడిదల మండల పరిధిలోని అనంతారం గ్రామంలో వన మహోత్సవం సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద మొక్కలు నాటే కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ కొమ్ము శ్రీనివాస్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో మొక్కల ప్రాధాన్యత ఎంతో ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందని, మొక్కలు పెరిగితే గ్రామంలో పచ్చదనం పెరగడంతో పాటు స్వచ్ఛమైన గాలి, ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వన మహోత్సవాన్ని కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా ప్రజలందరూ మొక్కలను సంరక్షించే బాధ్యతగా తీసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణకు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఊట్ల యాదిరెడ్డి, వార్డు సభ్యులు గోసుకొండ సాయిరెడ్డి, రామగాళ్ల రాములు, ఏల్లంకి పావని, తలారి శిల్ప, పంచాయతీ కార్యదర్శి సురేష్ యాదవ్, దేవాలయ కమిటీ సభ్యులు ఏల్లంకి భాస్కర్ గౌడ్, విజయ, గ్రామ పెద్దలు జింక గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

# వన మహోత్సవంతో పచ్చదనానికి బాట



**మునిపల్లి, ఆగస్టు 25 (సిరి న్యూస్):**

వన మహోత్సవం సందర్భంగా పెద్ద గోపులారం గ్రామంలో మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బి. మల్లేశం మొక్క నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించి, వాటి ఎదుగుదలకు అవసరమైన నీరు అందించాలని సూచించారు. పచ్చదనం పెంపొందించడంలో గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ రామాచారి, ఎంపీఓ, ఏపీఓ, వార్డు సభ్యులు, మాజీ ఎంపీటీసీ పాండు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మకు బోనాలు



**శివంపేట ఆగస్టు 25 ( సిరి న్యూస్ )**

మెదక్ జిల్లా.శివంపేట మండలం,గంగాయి పల్లి గ్రామంలో శ్రావణ మంగళవారం బోనాల పండుగను గ్రామపంచాయతీ పాలకమండలి ఆధ్వర్యంలో ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఎల్లమ్మ కు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.తెలంగాణ సంప్రదాయానికి ప్రతీకగా నిలిచే బోనాల వేడుకల్లో భాగంగా మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలు ఎత్తుకుని గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా తరలివెళ్లారు. శివ శక్తుల ఆటలతో పోతురాజుల పాటలు,డప్పుల మోతలతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.చిన్నారులు,యువకులు,మహిళలు,గ్రామ పెద్దలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.ప్రతి ఏటా నిర్వహించే సంప్రదాయాన్ని కొనసాగిస్తూ ఈ ఏడాది కూడా గ్రామదేవతలకు బోనాలు సమర్పించి అమ్మవారి ఆశీస్సులు పొందారు.గ్రామ ప్రజలంతా ఐకమత్యంతో పండుగను జరుపుకోవడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రవెల్లి సాయిలు , మండల ఉపసర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు తాటి పవన్ కుమార్ గుప్తా గ్రామపంచాయతీ పాలకమండలి సభ్యులు,గ్రామ పెద్దలు,యువకులు,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ ఫారెస్ట్ లో వన మహోత్సవం.

### మొక్కలు నాటుదాంపర్యావరణాన్ని కాపాడుదాం

### ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి




**నర్సాపూర్ ఆగస్టు 25 ( సిరి న్యూస్)**

వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మంగళవారం నర్సాపూర్ అర్బన్ ఫారెస్ట్‌లో ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి మొక్కలు నాటారు.ఆమె మాట్లాడుతూ

పచ్చదనం పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా ముందుకు రావాలని వర్షాలు కురవాలంటే మొక్కలు నాటాలని మన కోసం మాత్రమే కాదు భావితరాల ఆరోగ్యకరమైన భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అన్నారు నర్సాపూర్ అర్బన్ పార్క్ లో చెట్లను సంరక్షించడంతో ఆహ్లాదకర వాతావరణం ఏర్పడింది ఈ అర్బన్ పార్క్ ను చూడడానికి హైదరాబాద్ నుండి పర్యటకులు వస్తున్నారు వాతావరణ కాలుష్య నివారణకు చెట్లు ఎంతో మేలు చేస్తుందని మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం భావితరాలకు పచ్చని భవిష్యత్తును అందిద్దాం అన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ ఫారెస్ట్ అధికారులు కౌన్సిలర్లు, అధికారులు నాయకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## కాలుష్య నియంత్రణ కు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

### మున్సిపల్ చైర్మెన్ ఎస్. కృష్ణారెడ్డి

### జోగిపేట మున్సిపాలిటీలో వనమహోత్సవం



**జోగిపేట, ఆగస్టు 25, (సిరి న్యూస్ ):**

కాలుష్య నియంత్రణ కు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అందోల్–జోగిపేట మున్సిపల్ చైర్మెన్ ఎస్. కృష్ణారెడ్డి అన్నారు. ●మంగళవారం 'వనమహోత్సవం' మెగా ప్లాంటేషన్ లో భాగంగా పట్టణములో ని స్వాగత తోరణం (వెల్కమ్ ఆర్చ్ ) దగ్గర మొక్కలు నాటారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అన్నారు. పట్టణంలో అధిక మొత్తంలో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ . మొక్కలు నాటితేనే భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఎస్. జగన్మోహన్ రెడ్డి, జోగిపేట మార్కెట్ కమిటీ చైర్మెన్ ఏం. జగన్మోహన్ రెడ్డి, కమిషనర్ సిహెచ్. తిరుపతి, మాజీ మున్సిపల్ చైర్మెన్ గూడెం మల్లయ్య, పిఏ హనుమాన్లు, డీఈ రవీందర్, కౌన్సిలర్లు రామకృష్ణ, రాజశేఖర్, శ్రీనివాస్, అరుణ్ కుమార్, కో ఆప్షన్ ప్రవీణ్, మాజీ కౌన్సిలర్ లు పట్లోళ్ల ప్రవీణ్, ప్రదీప్ గౌడ్, డాకూరి శివశంకర్, లక్ష్మణ్, దుర్గేష్, అనిల్, సైలని, సంతోష్, కాలేదు తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలతో పచ్చదనానికి బాట..

- బెల్లంపల్లిలో వన మహోత్సవం..
- అధికారుల చేతుల మీదుగా మొక్కలు నాటకం..
- మొక్కలు నాటి..పర్యావరణాన్ని కాపాడాలని పిలుపు..




**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 25 (సిరి న్యూస్)**

పర్యావరణ పరిరక్షణలో చెట్ల పెంపకం అత్యంత కీలకమని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని అధికారులు సూచించారు. భూమికి ప్రాణవాయువును అందించే చెట్లు పర్యావరణ సమతుల్యతను కాపాడటంతో పాటు మానవ మనుగడకు అవసరమైన వనరులను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ నేపథ్యంలో బెల్లంపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో తెలంగాణ రాష్ట్ర అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో మహేందర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉప కలెక్టర్ చంద్రయ్య, అటవీశాఖ అధికారి విజయకుమార్ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పచ్చదనం పెంపుతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెంచి సంరక్షించినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారి పూర్ణచందర్, మండల పంచాయతీ అధికారి కృష్ణవేణి, సహాయ ప్రాజెక్టు అధికారి రజియా, సహాయ ప్రాజెక్టు మేనేజర్ విజయలక్ష్మి, అటవీశాఖ అధికారులు, ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకుంటాం

- 'శక్తి'లో విలీనం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- రాష్ట్ర మాజీ తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పోరేషన్ చైర్మన్ బిక్షపతి
- హున్నాపూర్ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట ఆందోళన

**జోగిపేట, ఆగస్టు 25, (సిరి న్యూస్):**

పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలను అడ్డుకుంటామని తెలంగాణ ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి అన్నారు. సోమవారం చౌటకూర్ మండలంలోని హున్నపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు ఆయన బీ ఆర్ ఎస్ నాయకులతో కలిసి సంఘీభావం ప్రకటిస్తూ మద్దతుగా ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మఠం బిక్షపతి మాట్లాడుతూ, పదో తరగతి పూర్తి చేసిన అనంతరం పాలిటెక్నిక్ విద్యను ఎంచుకునే వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు. పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నైపుణ్యాలను అందించి విద్యార్థులకు తక్కువ కాలంలోనే ఉద్యోగ అవకాశాలు కల్పించే పాలిటెక్నిక్ కోర్సులను బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. పాలిటెక్నిక్ విద్యను 'శక్తి' కార్యక్రమంలో చేర్చే నిర్ణయం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. ఇప్పటి వరకు ప్రత్యేక సాంకేతిక విద్యగా ఉన్న పాలిటెక్నిక్ వ్యవస్థ తన స్వతంత్రతను కోల్పోయి, కోర్సుల నిర్మాణం, నాణ్యత, ఉద్యోగ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులకు పరిశ్రమల్లో నేరుగా




లభించే ఉద్యోగ అవకాశాలు తగ్గిపోయే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. జీఓ నం.97 ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం బీజేపీ జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా పాలిటెక్నిక్ విద్యలో మార్పులు తీసుకొస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా తీసుకొస్తున్న స్కిల్ యూనివర్సిటీకి ప్రాధాన్యం కల్పించేందుకు పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే ప్రయత్నం జరుగుతోందని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్రంలో పరిశ్రమలకు అవసరమైన సాంకేతిక నిపుణులను తయారు చేస్తున్న పాలిటెక్నిక్ వ్యవస్థను బలోపేతం చేయాల్సింది పోయి, దానిని బలహీనపరచడం విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు.

## మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### సిఐటియు జిల్లా అధ్యక్షురాలు బాలమణి

**రామాయంపేట, ఆగష్టు 25 (సిరి న్యూస్)**

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా అధ్యక్షురాలు బాలమణి డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం డీఈఓకు మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాలమణి మాట్లాడుతూ, పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు బిల్లులు చెల్లించలేదని అన్నారు. ప్రభుత్వం పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తున్న, కార్మికులు సొంత డబ్బులతో సరుకులు కొనుగోలు చేసి విద్యార్థులకు భోజనం అందిస్తున్నారని అన్నారు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడంతో, అప్పులు చేసి భోజనం వండాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రస్తుతం కూరగాయలు, నూనె, పప్పులు, ఉప్పు తదితర నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయాయి అన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం చెల్లించే మొత్తాన్ని పెంచకపోవడంతో మధ్యాహ్న భోజనం నిర్వహించడం కష్టంగా మారిందన్నారు. ముఖ్యంగా వారానికి మూడు గుడ్లు విద్యార్థులకు అందిస్తున్నామని, ప్రభుత్వం ఒక్క గుడ్డుకు రూ.6 మాత్రమే చెల్లిస్తుండగా మార్కెట్‌లో రూ.8 వరకు వెచ్చించి కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. గుడ్ల ధర పెరగడంతో అదనపు భారం కార్మికులపైనే పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు ప్రారంభమైనప్పటి నుంచి పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే చెల్లించాలని, ఇకపై ప్రతి నెలా ముందుగానే బిల్లులు అందించాలని డిమాండ్ చేశారు. అలాగే గుడ్లను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని



కోరారు. మధ్యాహ్న భోజన కార్మికులకు గ్యాస్, యూనిఫామ్, గుర్తింపు కార్డులు అందించాలన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మధ్యాహ్న భోజన పథకానికి ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులను పెంచి, కార్మికులపై ఆర్థిక భారం పడకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంలో కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలన్నారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను చేపట్టాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు,మధ్యాహ్న భోజన కార్మికుల నాయకులు లాయర్ లక్ష్మి, నర్సింలు, ఫరీదా తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీపీఎస్ నిడమనూరులో ఘనంగా 'ఏయేక్సెల్ ల్యాబ్' ప్రారంభం

### టై బెల్ట్ ఐడి కార్డ్స్ , యూనిఫామ్స్ పంపిణీ

**నిడమనూరు, ఆగష్టు 25,సిరి న్యూస్ :**

మండల కేంద్రంలోని నిడమనూరు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నాడు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) ల్యాబ్' ను ప్రారంభోత్సవం చేసి, విద్యార్థులకు టై, బెల్టులు, ఐడీ కార్డులు, ఉచిత యూనిఫామ్‌ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్ శ్రీమతి శేషరాజు సంధ్యా శ్రీనివాస్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోనే మన పాఠశాలకు ప్రభుత్వం ఈ అత్యాధునిక ఏఐ



ల్యాబ్ సౌకర్యాన్ని కల్పించడం ఎంతో గర్వ కారణమని అన్నారు. ముఖ్యంగా వెనుకబడిన విద్యార్థులు కృత్రిమ మేధ సాంకేతికతతో భాషలు, గణితంలో వేగంగా రాణించడానికి ఇది చక్కటి వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఎంఈవో శ్రీ ఎల్. వెంకన్న, కాంప్లెక్స్ హెచ్‌ఎం శ్రీ డి. గౌతమ్ మాట్లాడుతూ తొలిమెట్టు) లక్ష్యాలను సాధించడంలో మరియు విద్యార్థులలో వ్యక్తిగత అభ్యాస సామర్థ్యాలు పెంచడంలో ల్యాబ్ ఎంతగానో దోహదపడుతుందని తెలిపారు. విద్యార్థులకు క్రమశిక్షణ, గుర్తింపు తెచ్చేలా మండలంలోనే తొలిసారిగా టై, బెల్టులు, ఐడీ కార్డులు అందించే ప్రయత్నం చేసిన నిడమనూరు ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. మండలంలో విద్యార్థుల నమోదుతో పాటు విద్యా, సాంస్కృతిక కార్యక్రమాల్లో నిడమనూరు పాఠశాల ఎప్పుడూ ముందంజలో ఉంటోందని అధికారులు ప్రశంసించారు. అనంతరం అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు యూనిఫామ్స్, టై, బెల్ట్, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జ్ హెచ్‌ఎం కర్నాటి శ్రీను కుమార్, సీనియర్ ఉపాధ్యాయురాలు తోట ఝాన్సీ, ఉపాధ్యాయురాలు పులిపాటి పూర్ణిమ, వాలంటీర్ స్వాతి, ఎంఆర్సీ సిబ్బంది శ్రీనివాస్, శంకర్, లలిత, పాఠశాల పారిశుధ్య కార్మికులు బాబురావు, లక్ష్మిలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## పుస్తెలతాడు చోరి నిందితుడు అరెస్ట్

- వృద్ధురాలి మెడలోని బంగారు పుస్తెలతాడు ఎత్తుకెళ్లిన నిందితుని వద్ద ఆభరణం స్వాధీనం....
- మెదక్ పట్టణ ఇన్స్పెక్టర్ మహేష్.

**మెదక్ ఆగష్టు,25(సిరి న్యూస్)**

వృద్ధురాలి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కెళ్లిన చోరీ కేసును మెదక్ టౌన్ పోలీసులు ఛేదించారు. ఈ సందర్భంగా మెదక్ పట్టణ ఇన్స్పెక్టర్ మహేష్ మీడియా తో మాట్లాడుతూ పట్టణంలో సాయి నగర్ కాలనీ కి చెందిన 68 ఏళ్ల బాలెశెట్టి సులోచన ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నారు. ఈ నెల 22/23వ తేదీ అర్ధరాత్రి సుమారు 2.40 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంటి తలుపు కొట్టాడు. సులోచన తలుపు తెరవగానే బలవంతంగా ఇంట్లోకి ప్రవేశించిన నిందితుడు ఆమె మెడలో ఉన్న సుమారు నాలుగు తులాల రెండు వరుసల బంగారు పుస్తెలతాడు ను లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో సులోచన బంగారు గొలుసును గట్టిగా పట్టుకోవడంతో అది తెగిపోయింది. కొంత బంగారం ఆమె చేతిలో మిగలగా, మిగిలిన ఆభరణాన్ని నిందితుడు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. ఆమె కేకలు విని పై అంతస్తులో నివసిస్తున్న అల్లుడు కె. లింగ గౌడ్ కిందకు వచ్చేలోపే నిందితుడు పరారైనట్లు పోలీసులు తెలిపారు. చోరీ కి గురైన బంగారు ఆభరణం విలువ సుమారు రూ.4.50 లక్షలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి కుమారుడు బాలెశెట్టి సంతోష్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రైం నంబర్ 378/2026 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి అనుమానితుల పై నిఘా పెట్టడంతో పాటు మెదక్ పట్టణంలోని బంగారు దుకాణాలపై కూడా పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో సోమవారం దయారా స్ట్రీట్ వద్ద పోలీసులు





వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వచ్చిన వ్యక్తి పోలీసులను చూసి పారిపోయేందుకు ప్రయత్నించాడు. దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా చాకలి మొగులయ్య (34), తండ్రి చంద్రయ్య, తోగిట గ్రామం, హవేలీ ఘనపూర్ మండలంగా గుర్తించారు. విచారణలో సులోచన ఇంట్లోకి ప్రవేశించి ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడును బలవంతంగా లాక్కెళ్లినట్లు నిందితుడు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. చోరీ చేసిన బంగారాన్ని విక్రయించి డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో మెదక్ పట్టణానికి వస్తుండగా పోలీసులకు పట్టుబడినట్లు వెల్లడించారు. నిందితుడి పై గతంలో ఆటో దొంగతనం, రేషన్ బియ్యం అక్రమ తరలింపునకు సంబంధించిన కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి నుంచి చోరీకి గురైన బంగారు ఆభరణాన్ని స్వాధీనం చేసుకుని తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు.త్వరగా కేసును చేదించిన క్రైం టీమ్ సిబ్బంది నర్సింలు, మల్లేశం లను పట్టణ ఇన్స్పెక్టర్ మహేష్ అభినందించారు.

# కొంపల్లె రోడ్డుపై నారు..
# పాలకులపై నిరసన పోరు!..

## బురద రోడ్డుపై నారు నాటి నిరసన..





- వృద్ధులు, గర్భిణీలు, విద్యార్థులకు నరకయాతన..
- 3.15 కోట్ల నిధులున్నా.. రోడ్డు పనులు షురూ కావేం?..
- రాజకీయాలకు అతీతంగా రోడ్డు నిర్మించాలని డిమాండ్..

**మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 25 (సిరి న్యూస్)**

ఒక్క రహదారి లేక ఒక గ్రామం మొత్తం నరకయాతన అనుభవిస్తోంది! కొంపల్లె గ్రామస్తుల సహనం నేడు కట్టలు తెంచుకుంది. దశాబ్దాలుగా అభివృద్ధికి ఆమడ దూరంలో ఉన్న ఈ గ్రామం, ఇప్పుడు బురద రహదారి కారణంగా పూర్తిగా ఒంటరిగా మారిపోయింది. వర్షాకాలం వచ్చిందంటే చాలు, రాకపోకలు స్తంభించిపోయి, గ్రామస్తులు నిత్యం నరక యాతన అనుభవించాల్సిన దుస్థితి. అనారోగ్యం పాలైతే ఆస్పత్రికి తరలించడం కూడా గగనమే అయ్యే పరిస్థితుల మధ్య, ప్రజలు ఎంతగానో సహనం వహించారు. కానీ ఇక సహించలేమంటూ నేడు వారి ఆగ్రహం భగ్గుమంది. బురదమయంగా మారిన ప్రధాన రహదారిపైనే నిరసనగా నారు నాటి, పాలకుల నిర్లక్ష్యానికి అద్దం పట్టేలా వినూత్న పోరాటానికి తెరతీశారు. ఈ దృశ్యం చూసేవారి హృదయాలను కదిలించేలా, పాలకుల కళ్లు తెరిపించేలా సాగింది..

**వృద్ధులు, గర్భిణీలు, విద్యార్థుల యాతన అంతా ఇంతా కాదు..**

కొంపల్లె నుంచి గంగారం, చిన్నవెంకటాపూర్ వైపు వెళ్లే రహదారులు పూర్తిగా బురదమయంగా మారిపోవడంతో నిత్యం ప్రయాణం ప్రాణసంకటంగా మారింది. పింఛన్ అందుకునేందుకు వృద్ధులు ఏకంగా 15 కిలోమీటర్ల మేర బురద బాటలో నడవాల్సిన దుస్థితి నెలకొంది. తపాలా సిబ్బంది సైతం గ్రామం వైపు రావడానికి భయపడే పరిస్థితి, ఇదేనా అభివృద్ధి అని గ్రామస్తులు నిలదీస్తున్నారు..

**నిధులు మంజూరైనా...**
**పనులు షురూ కావేం?..**

గత ఏడాది బీజేపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఇదే తరహా నిరసనతో కేంద్రం నుంచి రూ.3.15 కోట్ల నిధులు మంజూరయ్యాయి. అయితే పనుల్లో వాటా కోసం స్థానిక కాంగ్రెస్ నేతలు రాజకీయ ఒత్తిళ్లు తెస్తూ, తమకు లేదా తాము చెప్పిన కాంట్రాక్టర్లకే పనులు అప్పగించాలని పట్టుబడుతూ నిర్మాణాన్ని అడ్డుకుంటున్నారన్న తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిధులు ఉండి కూడా రోడ్డు మొదలుకాకపోవడం వెనుక రాజకీయ కుమ్ములాటలేనని గ్రామస్తులు మండిపడుతున్నారు..

### స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు...ఇంకెన్నాళ్లీ నిర్లక్ష్యం?..

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడిచినా కనీస రహదారి, విద్యుత్ సౌకర్యాలు లేని దుస్థితిలో కొంపల్లె మగ్గుతోందని, ఇది పాలకుల ఘోర వైఫల్యానికి ప్రత్యక్ష నిదర్శనమని నిరసనకారులు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. వెంటనే రాజకీయాలకు అతీతంగా రహదారి నిర్మాణం ప్రారంభించాలని, గ్రామ ప్రజల కనీస హక్కులను కాపాడాలని డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన ఈ ఆందోళనకు నెన్నెల మండల బీజేపీ అధ్యక్షుడు అంగలి శేఖర్ నేతృత్వం వహించగా, నల్లి తిరుపతి, గడ్డం శ్రీనివాస్ గౌడ్, పెరుగు వెంకటేష్, కోనరపు రాజన్న, కేశవేణి పర్వతాలుతో సహా పలువురు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొని తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కళ్లు తెరుస్తారా? లేక కొంపల్లె ప్రజల కష్టాలు ఇలాగే కొనసాగుతాయా? అన్నదే ఇప్పుడు జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి స్వయం శక్తితో ఎదగాలి

### ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి

**వెల్దుర్తి,ఆగస్టు 25,(సిరి న్యూస్ ):**



వెల్దుర్తి:మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించి, కుటుంబాల అభివృద్ధితో పాటు సమాజ ప్రగతిలో కీలక పాత్ర పోషించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. వెల్దుర్తి మండల మహిళా సమైక్య కార్యాలయంలో ఏపీఎం సుభాష్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 18వ వార్షిక సర్వసభ్య సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళా సంఘాలు గ్రామీణ ప్రాంతాల్లో మహిళలకు ఎంతో ఉపయోగకరంగా నిలుస్తున్నాయని అన్నారు. పొదుపు అలవాటుతో పాటు మహిళలకు ఆర్థిక అవగాహన, స్వయం ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. మహిళలు తమలోని ప్రతిభను గుర్తించి కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు. చిన్న వ్యాపారాలు, కుటీర పరిశ్రమలు, స్వయం ఉపాధి కార్యక్రమాల ద్వారా ఆదాయ మార్గాలను పెంచుకుని ఆర్థికంగా నిలదొక్కుకోవాలని కోరారు. మహిళా సంఘాల సభ్యులకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మహిళలు అభివృద్ధి చెందితేనే కుటుంబాలు బలపడతాయని, కుటుంబాలు బలపడితే గ్రామాలు మరింత అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆదర్శ్, ఉపసర్పంచ్ శ్రవణ్ కుమార్, మండల రెవెన్యూ అధికారి విజయలక్ష్మి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నర్సింగ్, ఎంపీడీవో,సీసీలు విజయలక్ష్మి సుల్తానా, తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి టూర్‌ను అడ్డుకోవడం అత్యంత దుర్మార్గం

- రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని, మేధావులను కేంద్రం అవమానపరిచినట్టే
- ప్రధాని మోడీ ఎలాంటి సమాచారం లేకుండా పాకిస్థాన్ కు ఎందుకు వెళ్లారు?
- దేశ ప్రజలకు సమాధానం చెప్పాలి
- బీజేపీ నేతల ఆరోపణలు వన్ సైడ్ లవ్ లాంటివే
- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో బందీ అయిన స్వేచ్ఛ
- కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పునరుద్ధరించింది
- కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఫైర్






**హైదరాబాద్, ఆగస్ట్ 25 (సిరి న్యూస్):** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజల గొంతు నొక్కి, స్వేచ్ఛను పూర్తిగా బందీ చేశారని.. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛతో పాటు ఇందిరాపార్క్‌లో ధర్నా చేసుకునే స్వేచ్ఛను కూడా అందించామని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణం, 90 శాతం రుణమాఫీ, సన్నబియ్యం పంపిణీతో పాటు రేషన్ కార్డుల్లో స్మార్ట్ కార్డులు అందిస్తూ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. విద్యాభివృద్ధి కోసం అమెరికా పర్యటనకు వెళ్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టూర్‌ను లండన్ నుండే కేంద్రం వెనక్కి రప్పించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ఆయన మండిపడ్డారు. తెలంగాణ సీఎం పర్యటనను అడ్డుకోవడం అంటే రాష్ట్ర ప్రజలను, విద్యార్థులను, మేధావులను అవమానించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం హోదాలో రేవంత్ రెడ్డి అమెరికా వెళ్లాడానికి అన్ని అనుమతులు ఉన్నప్పటికీ ఎందుకు ఆపాల్సి వచ్చిందని ప్రశ్నించారు. ఈటెల రాజేందర్ విదేశీ పర్యటనలు, ప్రధాని మోడీ ఎలాంటి సమాచారం లేకుండా, అనధికారికంగా పాకిస్థాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ ఇంటికి వెళ్లిన వైనంపై బీజేపీ నేతలు ఎందుకు స్పందించలేదని నిలదీశారు. బీజేపీ వాళ్ళు ఏం చేసినా చెల్లుతుంది కానీ, కాంగ్రెస్ నాయకులు వెళ్తే అడ్డుకుంటారా అని ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో పనిచేయాలనే బలమైన తపనతో సీఎం రేవంత్ రెడ్డి ఉన్నారని, ఆయనపై వస్తున్న విమర్శలు కేవలం వన్ సైడ్ లవ్ లాంటివేనని స్పష్టం చేశారు. ప్రధాని మోడీ అనధికారికంగా విదేశీ పర్యటనలు చేసినప్పుడు లేని అభ్యంతరం, తెలంగాణ ప్రజల సంక్షేమం కోసం, ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ టూర్‌కు వెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డిపై ఎందుకని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

## పర్యాటక రంగ అభివృద్ధికి కృషి చేయాలి

### రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు.




**మెదక్ ఆగష్టు,25(సిరి న్యూస్)**



రాష్ట్రంలో పర్యాటక రంగ అభివృద్ధికి అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి సంజయ్ జాజు అన్నారు. మంగళవారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, అధికారులతో వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, ప్రత్యామ్నాయ పంటల సాగు, నీట్ పరీక్ష నిర్వహణ, పర్యాటక రంగ అభివృద్ధి తదితర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేసి పర్యాటకులకు సులభమైన ప్రయాణాలు, వసతి, స్మార్ట్ పాస్‌లు ఇతర సౌకర్యాలు కల్పించి 27 గుర్తించిన ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పర్యాటక రంగ అభివృద్ధి, పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను

- శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలి
- ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసు బందోబస్తు
- సోషల్ మీడియాలో వచ్చే ఫేక్ మెసేజ్ లను నమ్మవద్దు
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్
- ముస్లిం మత పెద్దలతో ఎస్పీ పీస్ మీటింగ్ నిర్వహణ



**సంగారెడ్డి, ఆగస్టు 25 (సిరి న్యూస్):**

ఈద్ మిలాద్ ఉన్ నబీ పర్వదినాన్ని పురస్కరించుకుని నిర్వహించే ర్యాలీలు మరియు వేడుకలను అత్యంత శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ సూచించారు. మంగళవారం సంగారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో ముస్లిం మత పెద్దలు మరియు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులతో ప్రత్యేకంగా పీస్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మత సామరస్యానికి ప్రతీకగా నిలవాలని, ఒకరి మత సంప్రదాయాలను మరొకరు గౌరవించుకున్నప్పుడే శాంతిభద్రతలు పరిమళిస్తాయని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ముందస్తుగా శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించామని, ర్యాలీల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పకడ్బంది బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

**సోషల్ మీడియా వదంతులపై అప్రమత్తత**

సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు, వాట్సాప్ గ్రూపుల్లో వచ్చే ఫేక్ లేదా ఫార్వర్డ్ మెసేజ్‌లను ప్రజలు నమ్మవద్దని ఎస్పీ హెచ్చరించారు. వచ్చే సందేశాలలో వాస్తవ ఎంత ఉందో నిర్ధారించుకున్న తర్వాతే ఇతరులకు పంపాలని, అనుమానాస్పద మెసేజ్‌లపై వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వదంతులు సృష్టించి అల్లర్లు, గొడవలకు కారణమయ్యే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. ఈ సమావేశంలో వివిధ వర్గాల మత పెద్దలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యల సాధనలో పీ ఆర్ టీయు కీలకం

### జిల్లా అధ్యక్షులు ఆకుల మాణయ్య

**పటాన్ చెరు, ఆగస్టు 25, (సిరి న్యూస్)**

ఉపాధ్యాయుల సమస్యల సాధనలో పీ ఆర్ టీ యు టీ ఎస్ సంఘం ఎప్పుడూ ముందు ఉంటుందని సంగారెడ్డి జిల్లా పి ఆర్ టీ యు టీ ఎస్ సంఘం అధ్యక్షుడు ఆకుల మాణయ్య అన్నారు. మంగళ వారం రాత్రి కిష్టారెడ్డి పేట లోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో జరిగిన పటాన్ చెరు, రామ చంద్ర పురం, అమీన్ పూర్, జిన్నారం మండలాల కు చెందిన మండలాల సర్వ సభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాలుగు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరయ్యారు. ఈ సమావేశంలో నాలుగు మండలాల కు చెందిన నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. మాణయ్య మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం పి ఆర్ సి, డీ ఏ ల విషయంలో ఉపాధ్యాయులు, ఉద్యోగ వర్గాల ను మోసం చేసిందని అన్నారు. వచ్చే నెల ఒకటో తేదీన పెన్షన్ విద్రోహ దినం గా భావిస్తూ నిర్వహించనున్న ధర్నా కార్య క్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయ వంతం చేయాలని ఆయన పిలుపు ఇచ్చారు. ఇంకా ఈ సమావేశం లో ప్రధాన కార్యదర్శి ఆకుల ప్రభు, జిల్లా గౌరవ అధ్యక్షుడు డాక్టర్ తులసీ రామ్ రాథోడ్, పీ ఆర్ టీ యు రాష్ట్ర అధికార ప్రతినిధి వంగా మహేందర్ రెడ్డి, పటాన్ చెరు మండల శాఖ అధ్యక్షులు మహారెడ్డి విఠల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, రామ చంద్ర పురం అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి అశోక్ రెడ్డి, అమీన్ పూర్ సంఘ బాధ్యులు ఆనంద్, రమేష్, జిన్నారం మండల బాధ్యులు అనిల్, పవన్ రాజ్, ఇతర నాయకులు మొగిలి మాల, కోక రజిత, ముకుంద రెడ్డీ, ఆర్ కే రెడ్డి, శ్రీకర్, రామానుజం, జ్యోతి, స్వప్న, శైలజ, విశ్రాంత ఉపాధ్యాయులు కే వి రవీందర్, రాములు, శశంక మౌళి, మధుసూదన్, సత్యనారాయణ, పటేల్ రాజేందర్ రావ్ తదితరులు పాల్గొన్నారు.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY, editor BADHE JAYASHREE.

## 22ఏ భూముల బాధితులకు
# అండగా బీఆర్ఎస్

- ఆగస్టు 29న అమీన్‌పూర్‌లో భారీ నిరసన సభ..
- 15 వేల మందితో పోరుబాట
- మాజీ మంత్రి హరీష్ రావు హాజరు

4





www.siridaily.com
RNI TG TEL/ 26/A0381

# సిరి

People's Voice వార్తపత్రిక

బుధవారం
ఆగస్టు-26-2026

సంపుటి (Volume) : 2
సంచిక (Issue) 225

MEDAK, SANGAREDDY, SIDDIPET
పేజీలు : 4




- ఎనగండ్లలో అద్భుతమైన పురాతన శిల్పకళ
- దశావతార సహిత యోగశయనమూర్తి – క్షీరసాగరమథన సహిత గజలక్ష్మి విగ్రహాల గుర్తింపు
- బుర్ర సంతోష్, మెదక్ జిల్లా చరిత్ర పరిశోధ కుడు,మన మెదక్ మన చరిత్ర

4

# ప్రాచీన శిల్పకళకు వేదిక మెదక్ జిల్లా

మెదక్ ఆగష్టు,25(సిరి న్యూస్) మెదక్ జిల్లా కుల్చారం మండలం ఎనగండ్ల గ్రామంలో అపురూపమైన శిల్పకళా సంపద వెలుగుచూ స్తోందని మెదక్ జిల్లా చరిత్ర పరిశోధకుడు బుర్ర సంతోష్ తెలిపారు. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో పురాతన శిల్పాలు, శిల్పఖండాలు విస్తరించి ఉన్నాయని, ఇవి మెతుకుసీమ చారిత్రక వైభవానికి ముఖ్య మైన ఆధారాలని ఆయన పేర్కొ న్నారు. స్థానిక ఆంజనేయ ఆల యం సమీపంలో నల్లరాతిపై చెక్కి న గజలక్ష్మి శిల్పం అత్యంత ప్రత్యేకమై నదని అన్నారు. సాధారణం గా ఆలయ ద్వారబంధాల వద్ద కనిపించే గజలక్ష్మి రూపానికి భిన్నంగా, ఈ శిల్పంలో క్షీరసాగర మథనం దృశ్యా న్ని కూడా అద్భుతంగా చెక్కారని వివరించారు. ఒకవైపు దేవతలు, మరోవైపు రాక్షసులు వాసుకి నాగును ఉపయోగించి సముద్రాన్ని మథి స్తున్న దృ శ్యం ఇందులో కనిపిస్తుందని తెలిపా రు. గజలక్ష్మి శిల్పానికి మరో వైపున విష్ణుమూర్తి రూపం కూడా చెక్కబడి ఉండటం దీని ప్రత్యేకతను మరింత పెంచుతుందని అన్నారు. అదే విధంగా హనుమాన్ ఆలయంలోని యోగశయనమూర్తి శిల్పం కూడా విశేషమైన శిల్పకళకు నిదర్శనమని ఆయన తెలి పారు.




# పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకుంటాం

## కోర్సులను 'శక్తి' కార్యక్రమంలో విలీనం చేయొద్దు

- జీఓ నం. 97 ద్వారా సాంకేతిక విద్యను దెబ్బతీస్తున్నారు
- ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి
- బీఆర్ఎస్ నేత మఠం బిక్షపతి
- హొన్నపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన

3

చౌటకూర్, సిరి న్యూస్: పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలను తీవ్రం గా అడ్డుకుంటామని తెలంగాణ ట్రేడ్ ప్రమో షన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి స్పష్టం చేశారు. సోమవారం చౌటకూర్ మండలంలోని హొన్నపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదో తరగతి పూర్తి చేసిన వెంటనే పాలిటెక్నిక్ విద్యను ఎంచుకునే వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాటమాడుతోందని ఆరోపించారు.

## ప్రకృతిని కాపాడుదాం!

- ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
- పచ్చదనం పెంపొందించాలి..
- పర్యావరణ సమతుల్యతను కాపాడాలి
- మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు : జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

2



## గొప్ప పోరాటయోధుడు
# బీపీ మండల్

- ఘనంగా బీపీ మండల్ జయంతి ఉత్సవాలు
- యాదవ సంఘం ఆధ్వర్యంలో రామాయంపేటలో విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ




2






# గొప్ప పోరాటయోధుడు బీపీ మండల్

- ఘనంగా బీపీ మండల్ జయంతి ఉత్సవాలు
- యాదవ సంఘం ఆధ్వర్యంలో

**రామాయంపేటలో విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ**

**రామాయంపేట, ఆగష్టు 25 (సిరి న్యూస్)** దేశంలో సామాజిక న్యాయం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తి బీపీ మండల్ అని రామాయంపేట మున్సిపల్ కౌన్సిలర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు గజవాడ నాగరాజు గుప్తా అన్నారు. మంగళవారం రామాయంపేటలో యాదవ సంఘం ఆధ్వర్యంలో బీహార్ మాజీ ముఖ్యమంత్రి, బీసీ మండల్ కమిషన్ చైర్మన్ బిందేశ్వరి ప్రసాద్ మండల్ 109వ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీపీ మండల్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గజవాడ నాగరాజు తో పాటు బీసీ సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు మెట్టు గంగారాం, బిఆర్ఎస్ నాయకులు మద్దెల రమేష్, యాదవ సంఘం ప్రతినిధులు బసన్నపల్లి రాజు యాదవ్, గొర్రెల కాపరుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వూడెం దేవరాజు, రామాయపేట ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు బసన్నపల్లి మల్లేశంలు మాట్లాడుతూ.. దేశంలో వెనుకబడిన బడుగు, బలహీన వర్గాలకు విద్య, ఉద్యోగాలతో పాటు రాజకీయ రంగంలోనూ సమాన హక్కులు దక్కాలనే లక్ష్యంతో బీపీ మండల్ నిరంతరం పోరాడారని తెలిపారు. బీసీ మండల్ కమిషన్ చైర్మన్‌గా ఆయన అందించిన సేవలు దేశ సామాజిక, రాజకీయ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి 27 శాతం బీసీ రిజర్వేషన్ల ద్వారా బీపీ మండల్ చేసిన కృషి ఎంతో కీలకమైందన్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అవకాశాలు కల్పించేందుకు ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. బీపీ మండల్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆయన ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు బీసీల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం బీపీ మండల్ విగ్రహ ఏర్పాటు కోసం భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టీయూడబ్ల్యూజే (iju) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.జి. శ్రీనివాస శర్మ, మున్సిపల్ కౌన్సిలర్లు పుట్టి సందీప్, దేవుని రంజిత్, గుగులోత్ రవి, కో ఆప్షన్ సభ్యులు గౌస్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు దాకి స్వామి, చింతల స్వామి, ఎనిశెట్టి అశోక్ గుప్తా, బైరం కుమార్, యాదవ సంఘం నాయకులు అన్నమైన పోచయ్య యాదవ్ ఎర్రగొల్ల రమేష్ యాదవ్, దోరగొల్ల దుర్గయ్య యాదవ్,అన్నమైన మల్లయ్య యాదవ్, రాములు యాదవ్, శ్రీశైలం యాదవ్, బత్తుల రవి యాదవ్, దోనేటి గోపాల్ యాదవ్, బీసీ, యాదవ సంఘం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.













# ప్రకృతిని కాపాడుదాం!

- పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి
- పచ్చదనం పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడాలి
- మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు :
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

**మెదక్ ఆగష్టు,25(సిరి న్యూస్)** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, పచ్చదనాన్ని పెంపొందించి పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు పాటుపడాలని, మొక్కల పెంపకంతో పచ్చని భవిష్యత్తుకు బాటలు వేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. వన మహోత్సవం సందర్భంగా మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలోని మహిళా మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో డీఎఫ్ఓ జో.జి , డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులతో కలిసితో జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మొక్కలు నాటారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మెదక్ జిల్లాలో వన మహోత్సవం కింద 31 లక్షల 95 వేల మొక్కలు నాటాలనే లక్ష్యం కాగా, ఇప్పటివరకు 19 లక్షల 43వేల 654 మొక్కలు నాటి .60.83 %.శాతం లక్ష్యాన్ని సాధించినట్లు తెలిపారు.పర్యావరణ పరిరక్షణలో మొక్కలు, అడవులు అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించడంతోపాటు వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు పచ్చదనాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. వన మహోత్సవాన్ని కేవలం మొక్కలు నాటే కార్యక్రమంగా కాకుండా, ప్రకృతిని పరిరక్షించే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని సూచించారు. భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, అవి వృక్షాలుగా ఎదిగే వరకు సంరక్షించాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను కాపాడినప్పుడే వన మహోత్సవ లక్ష్యం నెరవేరుతుందని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు బాటలు వేయవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ ప్రవీణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థినిలు, అటవీ శాఖ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.







# పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే కుట్రను అడ్డుకుంటాం

## కోర్సులను 'శక్తి' కార్యక్రమంలో విలీనం చేయొద్దు

- జీఓ నం. 97 ద్వారా సాంకేతిక విద్యను దెబ్బతీస్తున్నారు
- ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలి
- బీఆర్ఎస్ నేత మఠం బిక్షపతి
- హౌన్నపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట విద్యార్థులతో కలిసి నిరసన

**చౌటకూర్, సిరి న్యూస్:** పాలిటెక్నిక్ విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొస్తున్న విధానాలను తీవ్రం గా అడ్డుకుంటామని తెలంగాణ ట్రేడ్ ప్రమో షన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మఠం బిక్షపతి స్పష్టం చేశారు. సోమవారం చౌటకూర్ మండలంలోని హౌన్నపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట విద్యార్థులు చేపట్టిన ఆందోళనకు ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వెంటనే తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. పదో తరగతి పూర్తి చేసిన వెంటనే పాలిటెక్నిక్ విద్యను ఎంచుకునే వేలాది మంది పేద, మధ్యతరగతి విద్యార్థుల భవిష్యత్తుతో కాంగ్రెస్ ప్రభుత్వం చెలగాట మాడుతోందని ఆరోపించారు. పరిశ్రమలకు అవసర మైన సాంకేతిక నైపుణ్యాలను అందించి, తక్కువ కాలంలోనే ఉపాధి అవకాశాలు కల్పించే పాలిటెక్నిక్ కోర్సులను బలహీనపరిచే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. పాలిటెక్నిక్ విద్యను 'శక్తి' కార్యక్ర మంలో చేర్చడం వల్ల ఈ వ్యవస్థ తన స్వతంత్రతను కోల్పోతుందని, కోర్సుల నాణ్యతతో పాటు ఉద్యోగ అవ కాశాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీఓ నం. 97 ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా పాలిటెక్నిక్ విద్య లో మార్పులు తెస్తోందని, ఇది రాష్ట్రంలో సాంకేతిక విద్యను తీవ్రంగా దెబ్బతీస్తుందని మండిప డ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బాధ్య తల నుంచి తప్పించుకోవడానికే పాలిటెక్నిక్ విద్యను 'శక్తి' పథకా నికి అనుసంధానం చేస్తున్నారని ఆరోపించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తెస్తున్న స్కిల్ యూనివ ర్సిటీకి ప్రాధాన్యం కల్పించేందుకే ఏళ్ల తరబడి సేవలం దిస్తున్న పాలిటెక్నిక్ వ్యవస్థను నిర్వీ ర్యం చేస్తున్నారని అనుమానం వ్యక్తం చేశారు. విద్యార్థుల ప్రయోజనా లను దృష్టిలో పెట్టుకుని పాలిటెక్నిక్ విద్యను శక్తి కార్య క్రమంలో విలీనం చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిప క్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలను కలుపు కుని రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన లను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.













# 22ఏ భూముల బాధితులకు అండగా బీఆర్ఎస్

- ఆగస్టు 29న అమీన్‌పూర్‌లో భారీ నిరసన సభ..
- 15 వేల మందితో పోరుబాట
- మాజీ మంత్రి హరీష్ రావు హాజరు

**పటాన్‌చెరు, ఆగస్టు 25 (సిరి న్యూస్):** 22ఏ నిషేధిత జాబితాలో చేరిన భూములు, ప్లాట్లు, ప్లాట్ల బాధితులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉద్యమానికి సిద్ధమైంది. ఆగస్టు 29న అమీన్‌పూర్‌లో భారీ నిరసన సభ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, బీఆర్ఎస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు తన్నీరు హరీష్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మంగళవారం పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీఆర్ఎస్ నాయకులతో నిరసన సభ ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 22ఏ బాధితుల సమస్యలు, సభ విజయవంతానికి చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించారు. నాయకులు మాట్లాడుతూ.. 22ఏ జాబితా కారణంగా భూముల విక్రయాలు, రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి అనేక కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. అర్హత ఉన్న భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 22ఏ సమస్య పరిష్కారం కోసం బాధితులకు అండగా బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. సుమారు 15 వేల మందితో నిర్వహించనున్న నిరసన సభకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, 22ఏ బాధితులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# తూప్రాన్‌లో స్పెషల్ డ్రైవ్

### తూప్రాన్ సిఐ వెంకట్ రాజా గౌడ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు

తూప్రాన్ ఆగస్టు 25 సిరి న్యూస్ : తూప్రాన్ మున్సిపల్ పట్టణ పరిధిలో మంగళవారం ఉదయం స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా తూప్రాన్ సిఐ వెంకట్ రాజా గౌడ్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు పట్టణంలోని ప్రధాన రహదారిపై వాహనాలను ఆపి తనిఖీలు చేపట్టారు వాహనాల పత్రాలు డ్రైవింగ్ లైసెన్స్ ఇన్సూరెన్స్ సీట్ బెల్టు హెల్మెంటు తప్పనిసరిగా ధరించాలి నిబంధనలు ఉల్లంఘించిన వాహనదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సీఐ వెంకట్ రాజా గౌడ్ తెలిపారు ఈ కార్యక్రమంలో ఎస్ఐ యాదగిరి మధు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు






# ప్రాచీన శిల్పకళలకు వేదిక మెదక్ జిల్లా



- ఎనగండ్లలో అద్భుతమైన పురాతన శిల్పకళ
- దశావతార సహిత యోగశయనమూర్తి – క్షీరసాగరమథన సహిత గజలక్ష్మి విగ్రహాల గుర్తింపు
- బుర్ర సంతోష్, మెదక్ జిల్లా చరిత్ర పరిశోధకుడు, మన మెదక్ మన చరిత్ర

**మెదక్ ఆగష్టు,25(సిరి న్యూస్)** మెదక్ జిల్లా కుల్చారం మండలం ఎనగండ్ల గ్రామంలో అపురూపమైన శిల్పకళా సంపద వెలుగుచూస్తోందని మెదక్ జిల్లా చరిత్ర పరిశోధకుడు బుర్ర సంతోష్ తెలిపారు. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో పురాతన శిల్పాలు, శిల్పఖండాలు విస్తరించి ఉన్నాయని, ఇవి మెతుకు సీమ చారిత్రక వైభవానికి ముఖ్యమైన ఆధారాలని ఆయన పేర్కొన్నారు. స్థానిక ఆంజనేయ ఆలయం సమీపంలో నల్లరాతిపై చెక్కిన గజలక్ష్మి శిల్పం అత్యంత ప్రత్యేకమైనదని అన్నారు. సాధారణం గా ఆలయ ద్వారబంధాల వద్ద కనిపించే గజలక్ష్మి రూపానికి భిన్నంగా, ఈ శిల్పంలో క్షీరసాగర మథనం దృశ్యాన్ని కూడా అద్భుతంగా చెక్కారని వివరించారు. ఒకవైపు దేవతలు, మరోవైపు రాక్షసులు వాసుకి నాగును ఉపయోగించి సముద్రాన్ని మథి స్తున్న దృశ్యం ఇందులో కనిపిస్తుందని తెలిపా రు. గజలక్ష్మి శిల్పానికి మరో వైపున విష్ణుమూర్తి రూపం కూడా చెక్కబడి ఉండటం దీని ప్రత్యేకతను మరింత పెంచుతుందని అన్నారు.అదేవిధంగా హనుమాన్ ఆలయంలోని యోగశయనమూర్తి శిల్పం కూడా విశేషమైన శిల్పకళకు నిదర్శనమని ఆయన తెలి పారు.



యోగశయనమూర్తి చుట్టూ దశావతార రూపా లతో పాటు అష్టదిక్పాలకుల ప్రతిరూపాలు చెక్కబడి ఉండటం ఈ శిల్పం యొక్క కళాత్మక, ఆధ్యాత్మిక ప్రాధాన్యతను తెలియజేస్తోందన్నారు. ఎనగండ్ల గ్రామంలోని మరొక ప్రాంతంలో సోమ సూత్ర సహిత శివలింగం, అష్టమాతృకల శిల్పాలు, కాలగర్భంలో ధ్వంసమైన అనేక శిల్పఖండాలు ఉన్నాయని బుర్ర సంతోష్ తెలిపారు. గ్రా మంలోని శిల్పాలను సమగ్రంగా పరిశీలించి, వాటి చారిత్రక నేపథ్యాన్ని నమోదు చేయాల్సిన అవసరం ఉందన్నారు. "ఇలాంటి అరుదైన శిల్పాలు మన మెదక్ జిల్లా చరిత్ర ఎంత పురాతనమైనదో తెలియజేస్తున్నాయి. మెతుకుసీమ చరిత్ర ఇలాంటి పురా తన శిల్పాలలో దాగి ఉంది. మన చరిత్ర, సంస్కృతి, కళా వారసత్వానికి ప్రతీకలైన ఈ శిల్పసంపదను సంరక్షించి భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అన్నారు.మెదక్ జిల్లా చారిత్రక వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంలో ఇటువంటి శిల్పసంపద కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు.